
మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్.



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 10 | సంచిక 29 | కర్నూలు | శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi














## ఢిల్లీ సీఎంగా రేఖ గుప్త ప్రమాణ స్వీకారం

ప్రమాణం చేయించిన ఎల్జీ వికె సక్సేనా

హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు

ఎన్‌డిఎ పక్షాన పలువురు సిఎంలు, డిప్యూటి సిఎంలు హాజరు

ప్రత్యేక ఆకర్షణగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (శ్రీచక్ర) :దేశ రాజధాని దిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. 27 ఏళ్ల తర్వాత దిల్లీలో అధికారాన్ని దక్కించుకున్న భాజపా.. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అగ్రనేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తోపాటు కేంద్రమంత్రులు, ఎన్డీయే కీలక నేతలు, 20 రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. మరోవైపు సినీ, పారిశ్రామిక రంగాల పలువురు ప్రముఖులు సైతం విచ్చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, నేతలు సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఉదయం ఇంటినుంచి బయల్దేరిన రేఖాగుప్తా.. హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆమె రామ్‌లీలా మైదానానికి చేరుకొని, అందరినీ పలకరించారు. ఈ కార్యక్రమానికి సాధువులు, పలువురు ప్రముఖులు హాజరుకావడంతో భారీ భద్రత ఏర్పాటుచేశారు. 25,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. రేఖా గుప్తాతో పాటు భాజపా ఎమ్మెల్యేలు పర్వేశ్ వర్మ, ఆశీశ్ సూద్, మజీందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, కపిల్ మిశ్రా, పంకజ్ కుమార్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కొత్త సీఎంకు జడ్ కేటగిరీ సెక్యూరిటీని కేటాయించను న్నారు. హరియాణాలోని జులానాలో 1974 జులై 19న జన్మించిన రేఖా గుప్తా.. దిల్లీ యూనివర్సిటీ పరిధిలోని దౌలత్‌రామ్ కళాశాలలో బీకాం చదివారు. ఆ సమయంలోనే ఏబీవీపీ ద్వారా విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించారు. 1995-96లో దిల్లీ వర్సిటీ విద్యార్థి సంఘం కార్యదర్శిగా పనిచేశారు. 1996-97లో అధ్యక్షురాలిగా సేవలందించారు. మేరఠ్‌లోని చౌధరీ చరణ్‌సింగ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రం పట్టా పుచ్చుకొని కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. 1998లో మనీశ్‌గుప్తాను వివాహం చేసుకున్నారు. 2007లో ఉత్తర పీతంపుర మున్సిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. అనంతరం దక్షిణ దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆరెస్సెస్‌తో ఆమెకు సన్నిహిత సంబంధాలున్నాయి. సంఘ్ మహిళా సంబంధిత కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పాల్గొనేవారు. ప్రస్తుతం భాజపా మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. భాజపా నుంచి సుష్మాస్వరాజ్, ఉమాభారతి, వసుంధర రాజే, ఆనందీబెన్ పటేల్‌ల తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 5వ మహిళగా, దేశంలో విభిన్న పార్టీల నుంచి సీఎం పదవిని చేపట్టిన 18వ అతివగా రేఖాగుప్తా నిలిచారు.



## ఢిల్లీలో కొత్త శకం మొదలు కానుంది

### ఎపి సిఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్య

న్యూఢిల్లీ,ఫిబ్రవరి20 (శ్రీచక్ర) ఢిల్లీలో కొత్త శకం మొదలు కానుందని, అద్భుతమైన అభివృద్ధి జరగబోతోందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీలో కొత్త మార్పును చూడబోతున్నాం అని, ఇక నుంచి ఢిల్లీ మరోలా ఉంటుందన్నారు. ఢిల్లీకి మహిళా ముఖ్యమంత్రి ఉండడం తనకు చాలా ఆనందంగా ఉందని చంద్రబాబు తెలిపారు. గురువారం ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు, ఎన్డీఏ నేతలు హాజరయ్యారు. రేఖా గుప్తా ప్రమాణ స్వీకారానికి ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 'ఢిల్లీలో కొత్త మార్పును చూడబోతున్నాం. ఇక నుంచి ఢిల్లీ మరోలా ఉంటుంది. ఢిల్లీకి మహిళా ముఖ్యమంత్రి ఉండడం ఆనందంగా ఉంది. ఇక ఢిల్లీలో కొత్త శకం మొదలు కానుంది. అద్భుతమైన అభివృద్ధి జరగబోతోంది' అని అన్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

### ఎంపిక చేసిన బిజెపి అగ్ర నాయకత్వం



న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(శ్రీచక్ర) దేశ రాజధాని దిల్లీలో భాజపా ప్రభుత్వం కొలువుదీరగా, అసెంబ్లీ స్పీకర్‌గా రోహిణి నియోజకవర్గం నుంచి గెలిచిన విజేందర్ గుప్తా ను పార్టీ ఎంపిక చేసింది. దిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా పార్టీ తనను ఎంపిక చేయడంపై విజేందర్ గుప్తా హర్షం వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో ఆయనకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. దాదాపు 10 ఏళ్ల క్రితం అసెంబ్లీ నుంచి ఆయన బహిష్కరణకు గురయ్యారు. తాజాగా ఆయన అదే సభకు స్పీకర్‌గా ఎంపిక కావడం గమనార్హం. 2015లో దిల్లీ అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే అల్కాలంబాపై మరో ఎమ్మెల్యే ఓపీ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో సభలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. ఇందులో పాల్గొన్న భాజపా ఎమ్మెల్యే అయిన విజేందర్ గుప్తాను అప్పటి స్పీకర్ ఆరోజు సాయంత్రం 4 గంటల వరకు సభ నుంచి బహిష్కరించారు. అయితే బయటకు వెళ్లేందుకు ఆయన నిరాకరించడంతో.. మార్షల్స్ గుప్తాను భుజాలపై ఎత్తుకొని అసెంబ్లీ నుంచి బయటకు తీసుకెళ్లారు. తాజాగా దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. ఇదిలాఉంటే.. రామ్‌లీలా మైదానంలో గురువారం వేల మంది ప్రజల సమక్షంలో దిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు ఎన్డీయే నేతలు, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు హాజరయ్యారు. భాజపా పాలిస్తున్న 14 రాష్ట్రాల్లో ఎక్కడా మహిళా ముఖ్యమంత్రి లేకపోవడంతో పార్టీ అధిష్ఠానం రేఖాగుప్తా వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది

## కూటమి నేతల్లో ఎక్కడా సమన్వయ లోపం లేదు

వెన్ను నొప్పి కారణంగానే కొన్నికార్యక్రమాలకు దూరంగా ఉన్నా

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం

ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(శ్రీచక్ర ):ఏపీలో మూడు పార్టీల నేతలు సమన్వయంతోనే కలిసి ముందుకు వెళుతున్నట్టు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో సిఎం రేఖాగుప్తా ప్రమాణ స్వీకారానికి గురువారం హాజరైన ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వెన్ను నొప్పి కారణంగానే రాష్ట్రంలో కొన్ని సమావేశాలకు హాజరుకాలేకపోయానని.. ఇప్పటికీ వెన్ను నొప్పి తీవ్రంగా బాధిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. ఏపీని జగన్ అప్పుల కుప్పగా మార్చారని.. అందువల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని వెల్లడించారు. అయినా ఇచ్చిన హామీలు అమలు చేసుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. పర్యావరణ, అటవీ శాఖలు తనకు చాలా ఇష్టమైన శాఖలని.. నిబద్ధతతో తన మంత్రిత్వశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మధ్య ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొన్ని సమావేశాలకు దూరంగా ఉండడంపై సోషల్ మీడియాలో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి.. అయితే, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ప్రమాణస్వీకారానికి.. ఎన్డీఏ సమావేశానికి హాజరైన పవన్ కల్యాణ్.. మీడియా చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు.. ఏపీలో సమన్వయంతోనే కలిసి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు.

## ప్రజల కోసం అసెంబ్లీకి పోతారా లేదా



### ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తారా లేదా

### ప్రజలు ఎన్నుకున్నది ఇంట్లో కూర్చోవడానికి కాదు

### వైసిపికి సవాల్ విసిరిన పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

విజయవాడ,ఫిబ్రవరి20((శ్రీచక్ర) ): అసెంబ్లీకి వెళ్లే అంశంపై వైసీపీ పాలసీ ఏంటో చెప్పాలని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రజల పక్షాన పోరాడుతారా లేదా చెప్పాలన్నారు. వైసీపీ సభ్యులు అసెంబ్లీకి వెళ్లకపోతే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇంట్లో కూర్చొని ప్రెస్ మీట్‌లు పెట్టడానికి కాదు ప్రజలు మీకు ఓట్లు వేసిందని విమర్శించారు. దమ్ముంటే తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని వైఎస్ షర్మిల సవాల్ విసిరారు. వైసీపీ నేత బొత్స సత్యనారాయణపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లు ఖాళీగా ఉన్నది ఎవరో, రాష్ట్ర సంపదను పందికొక్కుల్లా తిన్నది ఎవరో రాష్ట్ర ప్రజానీకానికి తెలుసని విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వైసీపీపై వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. బొత్స సత్యనారాయణ మాటలు వింటుంటే దెయ్యాలు వేదాలు వర్ణించినట్లుందని ఆక్షేపించారు. నమ్మి అధికారం ఇస్తే ఖాళీగా ఉన్నదెవరో తెలుసునని విమర్శించారు. ఐదేళ్లలో ఎలాంటి పని చేయకుండా రాష్ట్ర సంపదను పందికొక్కుల్లా లెక్క నిద్ర పోయారని ఎద్దేవా చేశారు. అధికారం అనుభవిస్తూ ఖాళీగా కూర్చున్నారని మండిపడ్డారు. పార్టీ పాలసీకి, తండ్రి (మిగతా 2లో )

## సంపాదకీయం

### పొంచి ఉన్న మరో మహమ్మారి

గులియన్ బారీ సిండ్రోమ్ (జిబిఎస్)? లక్షమందిలో ఒకరిద్దరికి మాత్రమే సోకే ఒక వ్యాధి పేరు ఇది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానాతోపాటు, దక్షిణాది రాష్ట్రాలను ఈ మహమ్మారి వణికిస్తోంది. పాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తోంది. అంటువ్యాధి కానప్పటికీ, అరుదుగా సోకే వ్యాధే అయినప్పటికీ ఇది సోకితే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉండటంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై, వ్యాధి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయి. కలుషితమైన నీరు, ఆహారం కారణంగా సోకే జిబిఎస్ సాధారణంగా పెద్దవారిపై మాత్రమే ప్రభావం చూపిస్తుంది. అయితే ఇటీవల బయటపడిన కొన్ని కేసులలో పిల్లలకూ ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారణ కావడమే ఇప్పుడు కలవరం కలిగించే అంశం. ఢిల్లీలో వంద కేసులు వెలుగు చూడగా, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటికే 60 మంది ఈ వ్యాధి బారినపడ్డారు. ఒకే రోజు 11 కేసులు వెలుగు చూడటం వెన్నులో వణుకు పుట్టిస్తోంది. యాభై మంది జిబిఎస్ బారినపడ్డారనీ, వీరిలో ఇద్దరు మృతి చెందారని స్వయంగా ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్యమంత్రి ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తాజాగా తెలంగాణలోనూ జిబిఎస్ కాలు మోపినట్లు నిర్ధారణ అయింది. సిద్దిపేట జిల్లాకు చెందిన ఒక మహిళ జిబిఎస్ బారినపడి కన్నుమూయడంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఉదర సంబంధిత వ్యాధులకు కారణమయ్యే కాంపైలోబాక్టర్ జెజునీ అనే బ్యాక్టీరియాయే గులియన్ బారీ సిండ్రో మ్‌కూ కారణమవుతోంది. వైద్య పరిభాషలో ఇది ఒక ఆటో ఇమ్యూన్ వ్యాధి. కలుషిత నీరు, ఆహారంతో ఉదరంలోకి వ్యాధికారక బ్యాక్టీరియా ప్రవేశించి, తన ప్రతాపాన్ని చూపిస్తుంది. విరేచనాలు, కడుపు నొప్పి, నీరసంతో మొదలై, రోగ నిరోధక వ్యవస్థను దెబ్బతీయడం ఈ వ్యాధి ప్రత్యేకత. శరీరంలో ఉండే యాంటీబాడీలు సొంత కణజాలాలపైనే దాడి చేసి, నిర్వీర్యం చేస్తాయి. ఫలితంగా నాడీ వ్యవస్థ పనిచేయక, కండరాలు చచ్చుబడతాయి. సకాలంలో గుర్తించి చికిత్స పొందితే బతికి బయటపడే అవకాశం ఉన్నా, ఆలస్యం జరిగితే రోగిని వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ ఫెక్షన్ల కారణంగా రోగనిరోధక శక్తి క్షీణించినవారికి జిబిఎస్ త్వరగా సోకుతుందన్న వైద్యుల హెచ్చరికలు నిర్లక్ష్యం చేయడానికి వీలులేదు. గులియన్ బారీ సిండ్రోమ్ ప్రబలడానికి కుంభమేళా కూడా ఒక కారణం కావచ్చునని ఆయా రాష్ట్రప్రభుత్వాలు అనుమానిస్తున్నాయి. కోట్లాది మంది భక్తులు తరలివచ్చి స్నానాలు ఆచరిస్తూ ఉండటంతో నదీ జలాలు కలుషితమై జిబిఎస్ సోకుతోందన్న వైద్యనిపుణుల మాటలను కొట్టిపారేయలేం. మహారాష్ట్ర సరిహద్దుల్లో కర్ణాటకకు చెందిన రెండు గ్రామాల ప్రజలు ఈ వ్యాధికి గురికావడంతో ఆరా తీయగా ఇటీవల తీర్థయాత్రలకు వెళ్లివచ్చిన కొందరు గ్రామస్థులు జిబిఎస్ బారిన పడినట్లు తేలింది. కాబట్టి ప్రయాగ్‌రాజ్ సహా, గంగానదీ తీర ప్రాంతాల్లో జలశుద్ధికి చర్యలు తీసుకోవడం తక్షణావసరం. పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు గులియన్ బారీ సిండ్రోమ్ వ్యాధి గురించి, వ్యాధి లక్షణాల గురించి అవగాహన కలిగించడం మరీ ముఖ్యం. లేనిపక్షంలో విరేచనాలు, నీరసమే కదాని సొంత వైద్యం చేసుకుని ప్రాణాల మీదకు తెచ్చుకునే ప్రమాదం ఉంటుంది. తీర్థయాత్రలకు వెళ్లి స్వస్థలాలకు చేరుకున్నవారు తమలో ఈ వ్యాధి లక్షణాలు గమనిస్తే, తక్షణమే వైద్యులను సంప్రదించడం మేలు. జిబిఎస్‌కు చికిత్స ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడం గమనార్హం. ఈ వ్యాధికి వినియోగించే ఇమ్యునో గ్లోబ్యులిన్ ఇంజెక్షన్ల ఖరీదు 30 వేల రూపాయల పైమాటే. పైగా ఈ ఇంజెక్షన్లను రోజుకు మూడు చొప్పున ఇవ్వవలసి ఉంటుంది. పేద ప్రజానీకం ఇంతటి ఖర్చును భరించే పరిస్థితి ఉండదు కాబట్టి ప్రభుత్వాలు ముందుకు వచ్చి, ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు, ఇంజెక్షన్లు నిల్వ ఉండేలా చూడాలి. మొక్కై వంగనిది మానై వంగదంటారు. ఇప్పుడిప్పుడే దేశమంతటా వ్యాపిస్తూ, తన ప్రతాపాన్ని చూపిస్తున్న ఈ మహమ్మారి వ్యాధి కోరలు పెరికివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కతాటిపైకి వచ్చి, యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోకపోతే, కరోనా మాదిరిగా ఇది కూడా ప్రజల ప్రాణాలను పెద్ద సంఖ్యలో కబళించే ప్రమాదం ఉంటుంది. తస్మాత్ జాగ్రత్త!

## ప్రజల కోసం అసెంబ్లీకి పోతారా లేదా

మెదటిపేజీ తరువాయి...

ఆశయాలకు విరుద్ధంగా బీజేపీకి దత్తపుత్రుడిగా మారారని విమర్శించారు. ప్రజల సంపదను ప్యాలెస్‌కు మళ్లించుకున్నారని విమర్శించారు. ఐదేళ్లు ఖాళీగా ఉండి ఎన్నికల ముందు సిద్ధం అంటూ బయటకు వచ్చారని తెలిపారు. ఐదేళ్లు పని చేయకుండా ఖాళీగా ఉన్నారని తెలిసి ప్రజలు మిమ్మల్ని పనికి రాకుండా చేశారని మండిపడ్డారు. 151 సీట్ల నుంచి వైసీపీని 11 సీట్లకు ప్రజలు పరిమితం చేశారని.. అయినా కూడా మీ వైఖరిలో మార్పు రావడం లేదని విమర్శించారు. చివరకు ప్రతిపక్ష హోదా లేకుండా ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. మిర్చి రైతుల కష్టాలపై వైసీపీ కంటే ముందుగానే కూటమి ప్రభుత్వాన్ని తాము ప్రశ్నించామని తెలిపారు. రేట్ల హెచ్చుతగ్గులపై రైతు నష్టపోకుండా రూ. 5వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి పెట్టాలని డిమాండ్ చేశామని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వెంటనే నిధులు తీసుకురావాలని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశామని అన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా పెట్టుబడి సహాయం రూ. 20 వేలను వెంటనే అమలు చేయాలని తాము డిమాండ్ చేశామన్నారు. ప్రతి నెల కూటమి హామీలపై ఏపీ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నామని గుర్తుచేశారు. అసెంబ్లీలో అడిగే అవకాశం కాంగ్రెస్ పార్టీకి లేదు కాబట్టి.. 11 సీట్లతో అసెంబ్లీకి వెళ్లే అవకాశం మీకుంది కాబట్టి.. వైసీపీని శాసన సభకు వెళ్లాలని డిమాండ్ చేశామన్నారు. రైతుల పట్ల కూటమి నిర్లక్ష్యాన్ని సభ వేదికగా ఎండగట్టాలని వైసీపీని అడిగామని అన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూనే, వైసీపీ సభ్యులు అసెంబ్లీకి వెళ్లాలని కోరితే.. ప్రజల పక్షాన నిలబడాలని అడిగితే.. వ్యక్తిగత అజెండా అంటూ వైసీపీ నేతలు భుజాలు తడుముకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ప్రజలకు సమాధానం చెప్పకుండా దాటవేయడం మీ అవివేకానికి నిదర్శనమని ఆక్షేపించారు. మళ్లీ మళ్లీ వైసీపీని అడుగుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

## రాజలింగమూర్తి హత్యను ఖండించిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్‌భూపాలపల్లి, భూపాలపల్లి పట్టణంలోని రెడ్డికాలనీలో 15వ వార్డు మాజీ కౌన్సిలర్ భర్త నాగవెల్లి రాజలింగమూర్తి ని కొంతమంది గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేసి చంపడాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్రంగా ఖండించారు. దాడి జరిగి, చనిపోయిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే హుటాహుటిన అందుబాటులో ఉన్న కాంగ్రెస్ నేతలతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలో మృతిని బంధువులను ఎమ్మెల్యే ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. రాజలింగమూర్తి పై జరిగిన దాడిని అత్యంత తీవ్రంగా ఖండిస్తున్నానని, ఈ దాడి వెనుక ఎంతటివారున్నా శిక్షించాలని అన్నారు.

# కష్టాలలో ఉన్న రైతులను ఆదుకోవాలి కాని..,మాపైన విరుచుకు పడితే ఎలా..

### మాజీ ఎం ఎల్ ఏ కాటసాని రాంభూపాల్ రెడ్డి





కర్నూలు, ఫిబ్రవరి 20(శ్రీచక్ర): వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మరియు పాణ్యం మాజి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కార్యాలయం గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరంమాట్లాడిన కాటసాని రాంభూపాల్ రెడ్డి ధరల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గుంటూరు మిర్చి యార్డులో మిర్చి రైతులను మాజీ ముఖ్యమంత్రి మా పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ గారు పరామర్శించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ, దాని అనుకూల మీడియా చేస్తున్న ప్రచారం, మాట్లాడుతున్న మాటలు.. చాలా దుర్మార్గంగా, అన్యాయంగా ఉన్నాయి. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు, రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా ఉండాల్సింది పోయి.. మీరు కనీస బాధ్యతను నిర్వర్తించకుండా వదిలేసినప్పుడు ప్రజల పక్షాన నిలిచే ఒక పార్టీ అధ్యక్షుడిగా, ఒక మాజీ ముఖ్యమంత్రిగా మీ బాధ్యతను గుర్తు చేస్తే మీరు మాట్లాడుతున్న తీరు, ~~వ్యవహరిస్తున్న తీరు అత్యంత హేయంగా ఉంది. ముఖ్యంగా~~ రాష్ట్ర మంత్రులు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. రైతుల కష్టాలను కూడా వక్రీకరించి అబద్ధాలు పోగు చేసి తప్పుడు ప్రచారానికి దిగుతున్నారు. నేను రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, మంత్రులకు సవాల్ విసురుతున్నా. మీరు మాట్లాడుతున్న మాటలన్నీ చుట్టూ వందల మంది పోలీసులను పోగు చేసుకుని, రక్షణ పెట్టుకుని, మీ ఆఫీసుల్లో ఏసీ గదుల్లో కూర్చొని మాట్లాడటం కాదు.. ఇవే మాటల్ని పక్కనే ఉన్న గుంటూరు మిర్చి యార్డు దగ్గరకు వెళ్లి అక్కడ రైతులతో మాట్లాడితే మీ సంగతేంటో రైతులే తేలుస్తారు. నా నమ్మకం ఏంటంటే.. మళ్లీ మీరు మాట్లాడకుండా, ఆ అవసరమే లేకుండా మిమ్మల్ని మిరపకాయలు దంచినట్లు దంచిపారేస్తారు రైతులు. ఉద్దేశపూర్వకంగా ఒక్క పోలీసును కూడా నిన్న జగన్ గారి పర్యటనలో పెట్టలేదు. అసలు మాజీ ముఖ్యమంత్రికి జడ్ ప్లస్ కేటగిరీ ఉన్నా ఆయన్ను వెళ్లనీయకుండా చేసేందుకు ఉద్దేశపూర్వకంగా భద్రతా సమస్యలను సృష్టించే ప్రయత్నం చేశారు. అంటే.. ప్రజల సమస్యపైగానీ, రైతుల సమస్యపై గానీ, రాష్ట్రం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై గానీ, ఎవరూ కూడా ప్రశ్నించకూడదు, పోరాటాలు చేయకూడదు, ప్రజల తరపున నిలబడకూడదు.. అనేది మీ ఉద్దేశం. అయినా సరే, మీ ఎత్తుగడలను ఖాతరు చేయకుండా ప్రజల మనిషిగా ఆయన వెళ్లారు. మీలాంటి బెదిరింపులను, ఎత్తుగడలను, కుట్రలను చేదించగల ఓర్పు, నేర్పు, శక్తి, యుక్తి.. అన్నీ ఆయనకు ఉన్నాయి. ఆ విషయాలను మీరు ఎప్పుడూ మర్చిపోవద్దు. ఆయన రాజకీయాల్లోకి వచ్చేటప్పుడే నిర్ణయించుకున్నాడు. తన చివరి రక్తపుబొట్టు వరకు కూడా ప్రజల మధ్యనే ఉంటాను, ప్రజలతోనే ఉంటాను. ప్రజల కోసమే ఉంటానని. ఆ సంకల్పంలో ఎప్పుడూ కూడా ఆయన ఒక్క ఇంచుకూడా వెనక్కి తగ్గడు. అది గుర్తు పెట్టుకోండి. మరోవైపు ఎల్లో మీడియా వక్రీకరణలు ఈ ఉదయం చదివాను. ఒకడేమో ధరలపై అబద్ధాలు దరువు అంటాడు, మిర్చి యార్డులో జగన్ డ్రామా అంటాడు.. ఇంకొడేమో వైయస్సార్ సీపీ శ్రేణుల హంగామా అంటాడు. చంద్రబాబుకు ఊడిగం చేయడానికి, తద్వారా మీ ఆర్థిక ప్రయోజనాలు, కేసుల ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి ఈ రాతలు రాస్తున్నారు. మీరు మీడియా అని చెప్పుకోవడం మీకు ఆత్మవంచన అవుతుంది. నానా రకాలుగా ధరలు చెప్పారని అచ్చెన్నాయుడు, ఎల్లో మీడియా తెగ రాస్తున్నారు. అసలు గత సంవత్సరం రైతులకు ఎంత ధరవచ్చిందనేది చంద్రబాబు నాయుడే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు రాసిన లెటర్లో రాసిన లేఖలో పేర్కొన్నారు. 2022-23 లో మోడల్ ప్రైస్.. అంటే దాదాపుగా ఎక్కువ ధరకు అమ్ముడుపోయిందని అర్థం. మోడల్ ప్రైస్ పర్ క్వింటాలు రూ. 20,500 వచ్చిందని, 2023-24 లో మోడల్ ప్రైస్ రూ. 20000 వచ్చిందని నేరుగా మీ చంద్రబాబే కేంద్రానికి రాసిన లెటర్లో రాశారు. నిన్న జగన్ గారు ఏం చెప్పారు. గరిష్టంగా రూ. 27,000 వరకు రేటు వెళ్లిందని మార్కెట్ రేటు చెప్పారు. ఇందులో ఏం అవాస్తవాలు ఉన్నాయి. చంద్రబాబే చెబుతున్నారు కదా.. రూ. 20 వేలు దాటి అమ్మిందని చెబుతున్నారు కదా. అబద్ధాలు మీరు చెప్పి ఎదుటివాళ్లపై దుష్ప్రచారం చేయడానికి సిగ్గూ శరం ఉండొద్దా? నడిచొచ్చే నిలువెత్తు ఆబద్ధం చంద్రబాబు నాయుడు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నప్పుడు, ఆయన కొలువులో ఉన్న మంత్రులు కూడా నిజాలు చెప్తారని ఎలా అనుకుంటారు? వీరిని చూసి గోబెల్స్ ఆత్మకూడా అసూయపడుతోంది. వ్యవసాయరంగంలో విప్లవాత్మక చర్యగా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించని మిర్చి సహా ఇతర పంటలకూ వైయస్. జగన్ ప్రభుత్వం ఎంఎస్పీని ప్రకటించింది. అధికారంలోకి రాగానే అక్టోబరు 1, 2020న ఈ ధరలను ప్రకటించారు. ఆరోజుల్లో మిర్చికి ప్రకటించిన కనీస మద్దతు ధర రూ. 7వేలు. ఐదేళ్ల తర్వాత ఇప్పటి రేట్లతో పోలుస్తున్న మంత్రి అచ్చెన్నాయుడిని ఏమనాలి? రైతుల సమస్యలపై ప్రభుత్వానికి ఉద్యానవన శాఖ అధికారులు నివేదిక ఇస్తూ క్వింటాలుకు రూ. 11.600 చొప్పున మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద కనీసం 25 శాతం పంటను కొనుగోలు చేయాలని, దీనికి రూ. 3,480 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవుతుందని కూడాచెప్పారు. రైతులను ఆదుకోవడానికి ఈ మేరకు ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పి, చంద్రబాబుగారు ఈ ప్రతిపాదనను పూర్తిగా పక్కనపెట్టిన మాట వాస్తవం కాదా? మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద కాకుండా మార్కెట్ ప్రైస్ సపోర్ట్ కింద నాఫెడ్ తరఫున కొనుగోలుకు లేఖ రాసి చేతులు దులుపుకోవాలని నిర్ణయించడం వాస్తవం కాదా? గతంలో ఎప్పుడైనా నాఫెడ్ మిర్చిని కొనుగోలు చేశారా? అలా కొనుగోలు చేయలేనప్పుడు కేంద్ర ప్రభుత్వానికి, నాఫెడ్కు లేఖలు రాయడం మిర్చి రైతులను మోసం చేయడం కాదా? ఎవరికి బెదిరించడానికి కేసులు పెడతారు? పరామర్శ చేసినందుకు అన్యాయంగా కేసులు పెట్టారు.. మిర్చి యార్డు పరామర్శకు వెళ్లని వాళ్లపై కూడా కేసులు పెట్టారు. మీ కక్షలు తీర్చుకునే క్రమంలో మీ ఆతృత ఏంటో ఈ కేసులు పెట్టిన విధానంలో కనిపిస్తోంది. కేసులు, పోరాటాలు ఆయనకు కొత్తేం కాదు. ప్రజలే ఆయనకు శ్రీరామ రక్ష అన్నది గుర్తు పెట్టుకోండి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతలకు కష్టాలు, నష్టాలే మిగులుతున్నాయి. పంటలకు మద్దతు ధర దేవుడెరుగు.. కనీసం అమ్ముకుందామన్నా కొనేవారు లేరు. మొన్నటి వరకూ ధాన్యం రైతుల కష్టాలు చూశాం. ఇవాళ మిర్చిరైతుల కష్టాలు చూస్తున్నాం. చంద్రబాబు సీట్లోకి వచ్చారు, మళ్లీ రైతులను పట్టి పీడించడం మొదలుపెట్టారు. 14. 14. వైయస్సార్ సీపీ ప్రభుత్వంలో నిరుడు క్వింటాలుకు అత్యధికంగా రూ. 21-27 వేల దాకా పలికిన మిర్చి ధర, ఇప్పుడు రూ. 8-11వేలకు పడిపోయింది. పంట బాగుంటే ఎకరాకు సగటున 20 క్వింటాళు దిగుబడి వస్తుంది. తెగుళ్లు కారణంగా ఈ ఏడాది దిగుబడులు పడిపోయాయి. ఏ జిల్లాలో చూసినా ఎకరాకు 10 క్వింటాళ్లకు మించి రాలేదు. పెట్టు బడి ఖర్చులు చూస్తే, ఎకరా సాగుకు సుమారు రూ. 1,50,000 పైమాటే అవుతోంది. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కృష్ణా. ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, అనంతపురం ఈజిల్లాల్లో రైతులందరి పరిస్థితీ అంతే. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ఆ ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి.. వీరంతా పట్టించుకోవడంలేదు. ప్రభుత్వంలో ఒక్క రివ్యూ కూడా చేయలేదు. గవర్నమెంటు తరఫున రైతులను పలకరించే వారు లేరు. రాష్ట్ర సచివాలయానికి అత్యంత సమీపంలో గుంటూరు మార్కెట్ యార్డు ఉంది. ఇక్కడ రైతుల ఆక్రోశం, ఆవేదన చంద్రబాబునాయుడు గారికి వినిపించడంలేదు. చంద్రబాబుగారు అధికారంలోకి వచ్చి రైతులకు సహాయం చేయ కపోగా, వైయస్సార్సీపీ ప్రభుత్వంలో వ్యవసాయరంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలన్నింటినీ కూడా మూలన పడేశారు. ఆర్బీకేలను, ఈ-క్రాప్ వ్యవస్థలను నిర్వీర్యంచేశారు. ఇంటిగ్రేటెడ్ ల్యాబులను నిర్వీర్యంచేశారు. సీజన్ మొదలయ్యే సరికి రైతులకు పెట్టుబడి సహాయం, రైతులకు సున్నావడ్డీకే రుణాలు, విత్తనాలు ఎరువులకు సైతం ఆర్బీకేల్లో నాణ్యతకు గ్యారంటీ... ఇలా ప్రతి విప్లవాత్మక మార్పునూ ఉద్దేశపూర్వకంగా మూలనపెట్టారు. వైయస్సార్సీపీ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వం ఓూఖ ప్రకటించని పసుపు, మిర్చి, ఉల్లి, అరటి లాంటి పంటలకే కాదు, మొత్తంగా 24 పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించి, రైతులకు ఓూఖ ధరలు రాకపోతే, రాష్ట్ర ప్రభుత్వమే జోక్యంచేసుకుని కొనుగోలు చేసేది. కనీస మద్దతు ధరలు తెలియజేస్తూ ఆర్బీకేల్లో పోస్టర్లు ఉంచేవాళ్లం. ధాన్యం కొనుగోలుకు రూ. 65,258 కోట్లు ఖర్చు చేస్తే, ధాన్యం కాకుండా ఇతర పంటల కొనుగోలు కోసం అక్షరాల రూ. 7,773 కోట్లు ఖర్చు చేసి మన ప్రభుత్వం రైతులను ఆదుకుంది. ఇవాళ మిర్చి రైతులు ఇన్ని కష్టాలు పడుతుంటే, చంద్రబాబు నాయుడుగారు కుంభ కర్ణుడిలా నిద్రపోతున్నాడు.. ఇప్పుడు మిర్చికి వచ్చినట్టే పంటలకు వ్యాధులు వస్తే ఆర్.బి.కె సిబ్బంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు వెంటనే విషయాన్ని ప్రభుత్వానికి చేరవేయడం ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన సూచనలు ఇచ్చి రైతులు పాటించేలా చేసేవాళ్లం ఆర్బికేల ద్వారా రైతులకు తగిన శిక్షణ అందేది రైతులకు అవగాహన కలిగించేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ పొలంబడి లాంటి కార్యక్రమాలు నిర్వహించే వాళ్ళం.. 22. 22. రైతులకు అందే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు జరిగేవి. ప్రభుత్వం ఏర్పాటుచేసిన 147 ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబుల్లో పరీక్షలు జరిగేవి. ఇప్పుడు ఈ ల్యాబులను గాలికొదిలేశారు. ప్రైవేటుకు అప్పగిస్తున్నారు. వైయస్సార్ సీపీ హయాంలోమిరప రైతులకు ఎప్పుడూలేని విధంగా చాలా గొప్పగా పంటల బీమా అందించాం. 2019-20లో రూ. 90.24 కోట్లు, 2020-21 లో 36.02 కోట్లు, 2021-22లో రూ. 439.79 రైతులకు కోట్లు అందించాం. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ఇప్పుడు ఉచిత పంటల బీమాను పూర్తిగా రద్దుచేసి రైతులపై భారాన్ని మోపారు. మన ప్రభుత్వంలో రైతులపై ఒక్కపైసా భారం మోపకుండా ఉచిత పంటలబీమాను అమలు చేసి, 54.55 లక్షల మందికి రూ. 7,802 కోట్లు పంట నష్టపరిహారం కింద చెల్లించాం. ఒక్క మిర్చే కాదు. కంది పండిస్తున్న రైతులు కూడా ధరల్లేక విలవిల్లాడుతున్నారు. కందిపప్పు క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ. 7,550 అయితే, ఇప్పుడు రూ. 5,500లు కూడా రావడంలేదు. గత ఏడాది రూ. 9-10వేల మధ్య ధర వచ్చేది. కాని మార్కెట్లో కిలో కందిపప్పు రూ. 150లు పైనే ఉంది. గత ఏడాది క్వింటాలు పత్తి ధర రూ. 10వేలు ఉండేది. ఇప్పుడు రూ. 5వేలుకూడా దాటడం లేదు. పెసలు కనీస మద్దతు ధర రూ. 8,558లు. ఇప్పుడు రూ. 6వేలు రావడం కష్టంగా ఉంది. అలాగే మినుములు కనీస మద్దతు ధర రూ. 7,400. గత ఏడాది క్వింటాలుకు రూ. 10వేలు రాగా, ఇప్పుడు రూ. 7వేలు కూడా రావడంలేదు. టమోటా రైతులకు కిలోకి రూ. 3-5లు కూడా రావడంలేదు. చంద్రబాబూ... ఇప్పటికైనా కళ్లు తెరవండి. రైతే రాజని గుర్తించండి, రైతు కన్నీరు పెట్టకుంటే... అది రాష్ట్రానికి అరిష్టం. చంద్రబాబుగారు గుంటూరు మార్కెట్ యార్డుకు వచ్చి మిర్చి రైతులతో మాట్లాడి, వారికి బాసటగా నిలవాలి. ప్రభుత్వమే మిర్చిని కొనుగోలుచేసి రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేస్తున్నాం అని నంద్యాల జిల్లా అధ్యక్షులు మరియు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లు, వైఎస్ఆర్సీపీ కర్నూలు జిల్లా అనుబంధం విభాగాలు అధ్యక్షులు, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీచక్ర
శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

# ఏపీపీఎస్సీ పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, అనుమతి లేదు

**Xఅభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు**
**Xడిఆర్ఓ సి వెంకటనారాయణమ్మ**





కర్నూలు ఫిబ్రవరి 20 (శ్రీచక్ర): పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, అనుమతించబడని డిఆర్ఓ సి. వెంకటనారాయణమ్మ తెలియజేశారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఏపీపీఎస్సీ గ్రూప్ -2 పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, సమీక్షా సమావేశంను నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, అనుమతించబడవని అన్నారు. ఈనెల 23 వ తేదీన ఏపీపీఎస్సీ గ్రూప్- 2 పరీక్షలు ఆదివారం ఉదయం 10:00 గంటల నుంచి 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్నారు. అభ్యర్థులు ఉదయం 09:30 గంటల వరకు గ్రేస్ పీరియడ్ తో కలిపి 9.45 గంటల వరకు అనుమతించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3.00గంటల నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహించడం జరుగుతుందని మధ్యాహ్నం 2.30 వరకు 15 నిమిషాలు గ్రేస్ పిరియడ్ అంటే 2.45 గంటల వరకు అనుమతించనున్నట్లు తెలిపారు. హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని అన్నారు. జిల్లాలో 30 కేంద్రాలలో 9993 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నరన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడి కార్డ్, మొదలైనవి) తీసుకురావాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు కల్పించామని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ నంబర్ 08518-277305, ఉదయం 10 గంటలనుండి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటుందని, సందేహాలు ఉంటే సంప్రదించాలని కోరారు. ఏపీపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ కుమార్ రాజు, మాట్లాడుతూ ప్రతి అభ్యర్థి ప్రశ్నపత్రం సీరిస్ ను వ్రాసి ఒఎంఆర్ జవాబు పత్రంలో మాత్రమే బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో నిర్దేశించిన ప్రదేశములు సర్కిల్ ను బబుల్ చేసేలా చూసుకోవాలన్నారు. ఎగ్జామినేషన్ పూర్తయిన తర్వాత ఇన్విజిలేటర్స్ జవాబు పత్రాలను జాగ్రత్తగా సీల్ చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు కూడా ఉంటాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ డిఎస్పి బాబు ప్రసాద్, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వి బాబురావు సెక్షన్ ఆఫీసర్లు బ్రహ్మేశ్వర రావు, కే. సుధాకర్ బాబు, ఏ ఎస్ ఓ లు కెవెస్ఎస్ అనిల్ కుమార్,టిఆంజనేయులు,ఏయోగేష్ పాల్గొన్నారు.

## నూతన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

**పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, కమిషనర్ రవీంద్ర బాబు**



కల్లూరు, ఫిబ్రవరి 20 (శ్రీచక్ర): నగరంలో నూతనంగా ఏర్పడిన కాలనీల్లో, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరిత రెడ్డి, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. గురువారం 35వ వార్డు చింతలముని నగర్ నందు రూ.8 లక్షలతో, 41వ వార్డు టీజీబీ కాలనీలో రూ.9.50 లక్షలతో, 36వ వార్డు ఎస్ఎల్వి నిలయం, వాసవి నగర్ ప్రాంతాల్లో రూ.9.90 లక్షలతో డబ్ల్యూబియం రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే, కమిషనర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరం రోజురోజుకు విస్తరిస్తుందని, నూతన కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారులపై వెంటనే డబ్ల్యూబియం రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజా ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కారించేందు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ రాజశేఖర్, ఎంఈ శేషసాయి, డిఈఈ క్రిష్ణలత, ఏఈ భానుప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌లో అల్పాహార రుచి పరిశీలించిన కమిషనర్





కర్నూలు, ఫిబ్రవరి 20 (శ్రీచక్ర): నగరంలో పరిమళ నగర్ వద్దనున్న అన్న క్యాంటీన్లో గురువారం ఉదయం నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అల్పాహార రుచిని చూశారు. నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణాన్ని చూసిన కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు రుచికర నాణ్యమైన ఆహారం అందించాలని, నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. అంతకుముందు ఆయన బండిమెట్ట, ఛత్రీబాగ్, బడపడఖాన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. రహదారులపై శుభ్రత పనులు పూర్తి అయ్యాక, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. అలాగే అయప్పనగర్ 89వ సచివాలయాన్ని కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. సర్వేల ప్రక్రియ వేగవంతం చేయాలని, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరుపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

## 21న న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 20 ( శ్రీచక్ర): కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21 తేదీన న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, బి.ఎస్ రవి కాంతులు పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అడ్వకేట్ సవరణ బిల్లు - 2025 వల్ల న్యాయవాదుల ప్రయోజనాలకు మరియు బార్ అసోసియేషన్ల స్వయంప్రతిపత్తి దెబ్బతినే అవకాశం ఉందని అన్నారు. కేంద్రం వెంటనే అడ్వకేట్ సవరణ బిల్లు - 2025 ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. 21న న్యాయవాదుల కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుల కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించిందని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఈ-శ్రమ్ కార్డు ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత

**జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేయించండి: జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



కర్నూలు, ఫిబ్రవరి 20 (శ్రీచక్ర): ఈ-శ్రమ్ కార్డు ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుందని, జిల్లాలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.. గురువారం ఉదయం ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ అంశంపై కార్మిక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పరిశ్రమల శాఖ, మత్స్య శాఖ, డిఆర్డిఏ, మెప్మా, డ్వామా, వ్యవసాయ, ఐసిడిఎస్ శాఖల అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ లతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డు అవసరమైన సమయాల్లో ఆసరా గా నిలుస్తుందన్నారు.. ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకున్న అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.. అసంఘటిత రంగాలలో పనిచేసే కార్మికులకు యాక్సిడెంట్ లేదా మరణాలు సంభవించినప్పుడు, అసహాయ పరిస్థితుల్లో ఉన్న వారి కుటుంబ సభ్యులకు ఈ-శ్రమ్ కార్డు తగిన సాయం అందించే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.. ఈ-శ్రమ్ పోర్టల్ లో నమోదు చేసుకున్న అసంఘటిత రంగ కార్మికులకు ప్రమాదాలు జరిగినపుడు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల ప్రమాద, మరణ, అంగవైకల్య బీమా ఉచితంగా లభిస్తుందని కలెక్టర్ తెలిపారు.. కాబట్టి అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ-శ్రమ్ పోర్టల్ లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు..16 నుండి 59 సంవత్సరాల వయస్సు లోపు ఉన్నవారు, ఇన్కమ్ టాక్స్ పరిధిలోకి రానివారు, ఈఎస్ఐ, ఈపిఎఫ్ సదుపాయం లేని అసంఘటిత కార్మికులు అందరూ నమోదుకు అర్హులని, ఉచితంగా ఈ-శ్రమ్ పోర్టల్ లో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ మరియు అనుబంధ శాఖల్లో ఉన్న ఉపాధి పనుల వారు, చిన్న, సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, నర్సరీలలో పనిచేసే వారు, పాడి పరిశ్రమలో పనిచేసే కార్మికులు, మత్స్య కార్మికులు, తాపీ మేస్త్రీలు, రాళ్లు కొట్టేవారు, సెంట్రింగ్, ప్లంబింగ్, పెయింటర్, ఎలక్ట్రీషన్, వెల్డింగ్, ఉపాధి వర్కర్లు, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లు, మిడ్ డే మిల్ వర్కర్లు, తదితరులందరూ అసంఘటిత రంగ కార్మికుల కిందకు వస్తారని కలెక్టర్ తెలిపారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్న వారిని, ఆశా వర్కర్లను, స్వయం సహాయక సంఘాల సభ్యులను, ఫిషర్మెన్ అసోసియేషన్ వారితో మాట్లాడి మత్స్య కార్మికులను, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్లో లో డ్రైవర్లు, ఆటో డ్రైవర్ లు, పారిశుధ్య కార్మికులు, చిన్న, సన్న కారు రైతులను, అంగన్వాడి హెల్పర్, ఆయా లను, జల వనరుల శాఖ కాంట్రాక్ట్ లేబర్, చేనేత, కమ్మరి, కుమ్మరి కార్మికులు, మిడ్ డే మిల్ వర్కర్లను, ప్రైవేట్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ స్టాఫ్, బ్యూటీ పార్లర్ లో పనిచేసే వారిని, హమాలీలను అందరినీ ఈ-శ్రమ్ పోర్టల్ లో నమోదు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు... గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వీరిని నమోదు చేయించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను, ఎంపిడిఓ లను, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు... అసంఘటిత రంగ కార్మికులందరికీ సాయం చేస్తున్నామనే భావంతో ఈ అంశాన్ని ఛాలెంజ్ గా తీసుకొని ప్రతి ఒక్కరిని ఈ శ్రమ్ పోర్టల్ లో నమోదు చేయించాలన్నారు. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించాలని కలెక్టర్ కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ను ఆదేశించారు .. వచ్చే సమావేశం నుండి నిర్దేశించిన లక్ష్యాల వారిగా పురోగతిపై సమీక్ష చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. టెలి కాన్ఫరెన్స్ లో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పి4 సర్వే ను విజయవంతంగా నిర్వహించండి

**ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

కర్నూలు, ఫిబ్రవరి 20 (శ్రీచక్ర): ఈ నెల 20 వ తేదీ నుండి మార్చి రెండవ తేదీ వరకు చేపడుతున్న పి4 సర్వే ను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆయా శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ లు, డైరెక్టర్ లు తదితర ఉన్నతాధికారులతో కలిసి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -ఎఎ పరీక్షల నిర్వహణ,ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, పి 4 సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -ఎఎ పరీక్షల నిర్వహణ,ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, పి 4 సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే నిర్వహణపై సీ ఎస్ పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పి 4 సర్వే (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్షిప్) ద్వారా 20 శాతం అత్యంత పేదరికం కలిగిన వాళ్ళను గుర్తించడం జరుగుతోందని, మొదటి దశలో పి 4 సర్వే జరుగుతున్న జిల్లాల్లో కర్నూలు జిల్లా కూడా ఒకటని, ఈనెల 20వ తేదీ నుంచి మార్చి రెండవ తేదీ వరకు ఈ సర్వే నిర్వహించడం జరుగుతోందని తెలిపారు.. జిల్లాలో 18వ తేదీన సిపిఓ జెడ్పి సీఈవో ఎంపీడీవోలు, డి ఎల్ డి వో లకు ఈ అంశంపై శిక్షణ నిర్వహించడం జరిగిందన్నారు..19 వ తేదీన మండల స్థాయిలో గ్రామ,వార్డు సచివాలయం సిబ్బందికి కూడా శిక్షణ ఇచ్చామన్నారు..ఈ అంశంపై ఇప్పటికే ఎంపిడిఓ లు, గణాంక అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.. ముఖ్యమంత్రి గారు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారుల ఆదేశించారు.. ఎంపీడీవోలు స్టాటిస్టికల్ అధికారులతో సమన్వయం చేసుకుని, సచివాలయ సిబ్బంది ద్వారా పి 4 సర్వేని పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన నిర్వహించే గ్రూప్-2 పరీక్షల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయి నుండి వచ్చిన ఆదేశాల మేరకు పరీక్షల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..పరీక్షలకు సంబంధించి సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వస్తే, వెంటనే ఖండించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..అలాగే జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షల కోసం కూడా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ రెండు రకాల పరీక్షల నిర్వహణకు ఆయా శాఖల అధికారులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ డా. బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, సిపిఓ హిమ ప్రభాకర రాజు, ఆర్ ఐ ఓ గురవయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు..

## దివ్యాంగుల సదరం వెరిఫికేషన్ ను పారదర్శకంగా చేపట్టండి....!,

**డిఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బి సి.నాగరాజు,**





ఎమ్మిగనూరు,ఫిబ్రవరి,20 (శ్రీ చక్ర):- ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల లో దివ్యాంగుల వైకల్యానికి సంబంధించి నిర్వహిస్తున్న "సదరం వెరిఫికేషన్" క్యాంపులో వెరిఫికేషన్ అధికారులను రాష్ట్ర దివ్యాంగుల సాధికారత ఫోరం (డిఈఎఫ్) అధ్యక్షులు బి సి. ఎవరైనా నాగరాజు కలిసి సదరం వెరిఫికేషన్ కు సంబంధించిన పలు అంశాలపై చర్చించడం జరిగింది. తదనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ అధికారిక రాష్ట్ర ప్రజా ప్రభుత్వం చేపట్టినటువంటి సదరం వెరిఫికేషన్ చాలా హర్షించదగ్గ విషయమని, ఈ వెరిఫికేషన్ లో చాలామంది వికలత్వం కానీ ఫేక్ వికలత్వంతో అడ్డదారుల్లో దళారుల ద్వారా డబ్బులు చెల్లించి "సదరం సర్టిఫికెట్లు" పొందిన వారందరూ బయటపడతారని, అలాంటి వారి సర్టిఫికెట్ల తొలగింపుతో అసలు సిసలైన వికలత్వంతో బాధపడుతున్న వారికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు, కావున మన దివ్యాంగులందరూ దీనికి సహకరించి, తమ వికలత్వాన్ని చెక్ చేయించుకోవాలని కోరారు, కావున అసలు సిసలైన వికలత్వంతో బాధపడుతున్న దివ్యాంగులు ఈ క్యాంపులో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే, ఏవైనా సలహాలు సూచనలు కావాలంటే (డిఈఎఫ్ )రాష్ట్ర అధ్యక్షులు బీసీ.నాగరాజు ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఈఎఫ్ కార్యవర్గ సభ్యులు ఇస్మాయిల్, భాస్కర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పీ4' సర్వేకు నగర ప్రజలు సహకరించాలి :నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు

కర్నూలు, ఫిబ్రవరి 20(శ్రీచక్ర): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నగరంలో గురువారం నుండి పబ్లిక్ - ప్రైవేటు - పీపుల్స్ - పార్టనర్షిప్ (పీ4) సర్వే ప్రారంభమైందని, దీనికి నగర ప్రజలు సహకరించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేదరిక నిర్మూలనలో భాగంగా అత్యున్నత ఆర్థిక స్థానాల్లో ఉన్నవారిలో 10% మంది, అట్టడుగున ఉన్న వారిని 20% మందికి చేయూత అందించుట, ప్రతి ఇంటి వారి ఆర్థిక పరిస్థితిని అంచనా వేయుట, ప్రభుత్వ ప్రాజెక్టుల ద్వారా అవసరమైన కుటుంబాలకు ప్రైవేట్ రంగ సహాయాన్ని అందించడం వంటి లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఇంటి వద్దకు సచివాలయ కార్యదర్శులు వస్తారని, వారు కోరిన సమాచారాన్ని ప్రజలు అందించాలని సూచించారు. వచ్చే నెల 2వ వరకు ఈ సర్వే జరుగుతుందని, పేదరిక నిర్మూలనకు ఎంతగానో దోహదపడే ఈ సర్వేకు నగర ప్రజానీకం సహకరించాలని కమిషనర్ కోరారు.



## విశాఖపట్నం ఆర్డీఓపై చర్యలు తీసుకోండి

-ఐ అండ్ పిఆర్ మంత్రికి ఏపిఎంఎఫ్ ఫిర్యాదు



విజయవాడ, ఫిబ్రవరి 20:( శ్రీ చక్ర ) విశాఖపట్నంలో జరుగుతున్న అవినీతి, భూ అక్రమాలపై వార్తలు రాసిన 'లీడర్' పత్రిక యాజమాన్యానికి ఆర్డీఓ శ్రీలేఖ వారెంట్ నోటీసు జారీ చేయడంపై ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి పి. ఢిల్లీబాబు రెడ్డి రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధికి ఫిర్యాదు చేశారు. విజయవాడలోని మంత్రి పార్థసారధి క్యాంపు కార్యాలయంలో గురువారం నాడు ఏపిఎంఎఫ్ బృందం మంత్రిని కలిశారు. ఆర్డీఓ శ్రీలేఖ చర్యలు పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా ఉన్నాయని ఢిల్లీబాబు రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రతిష్టకు కూడా మచ్చ తెచ్చేలా శ్రీలేఖ తన పరిధిలో లేని అధికారాలతో జర్నలిస్టులను బెదిరించడం అప్రజాస్వామికమని ఢిల్లీబాబు రెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన మంత్రి పార్థసారధి ఆర్డీఓ పై ప్రభుత్వపరమైన చర్యలకు సిఫారసు చేస్తానని తెలిపారు. ఏపిఎంఎఫ్ ఫిర్యాదు మేరకు విశాఖపట్నం ఆర్డీఓపై చర్యలు తీసుకోవలసిందిగా రెవిన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.పి. సిసోడియాకు లేఖ రాస్తానని మంత్రి పార్థసారథి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీఎంఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఢిల్లీబాబురెడ్డి వెంట ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్, గోదావరి దినపత్రిక ఎడిటర్ బోళ్ళ సతీష్ బాబు ఉన్నారు.

## యూనివర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ కి విద్యాస్ఫూర్తి పురస్కారం ...!

### మోడరన్ అధినేత జీవి రావు చేతులమీదుగా అందజేత.



రామచంద్రపురం, ఫిబ్రవరి 20(శ్రీచక్ర)ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా భాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎస్. ప్రసన్నశ్రీ ని మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి. వి. రావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగావైస్ ఛాన్సలర్ కి మోడరన్ ఫౌండేషన్ తరపున విద్యా స్ఫూర్తి పురస్కారం అందజేసారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రసన్న శ్రీ మాట్లాడుతూ మోడరన్ విద్యాసంస్థల ద్వారా లయన్ జి.విరావుగ్రామీణవిద్యార్థులకు మెరుగైన విద్యను ఉన్నత ప్రమాణాలతోఅందజేయడంఅభినందనీయమన్నారు.ఈ సందర్భం గా వైస్ ఛాన్సలర్ మోడరన్ విద్యాసంస్థలతో తనకు గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.అనంతరం మోడరన్ అధినేత లయన్ జి. వి. రావు మాట్లాడుతూ వైస్ ఛాన్సలర్ గా ప్రసన్న శ్రీ నియామకంవిద్యారంగానికిగొప్పస్ఫూర్తిఅనిఆయన కొనియాడారు. భవిష్యత్తులో ప్రసన్న శ్రీ మరిన్ని ఉన్నతమైన పదవులు అధిరోహించాలని రావు ఈసందర్భంగా ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## వందల సంఖ్యలో కోళ్ళు మృతి

### ఆదుకోవాలని రైతు వేడుకోలు

రాజన్న సిరిసిల్ల,(శ్రీచక్రచందుర్తి మండలం లింగంపేట గ్రామంలో రమేష్ రావు అనే వ్యక్తి 14 ఏళ్లుగా కోళ్ల ఫారం తో జీవనోపాధి పొందుతున్నాడు. రైతుకు చెందిన కోళ్లు వారం క్రితం ఫామ్లో మూడు రోజుల వ్యవధిలో 2500 కోళ్లు మృత్యువాత పడ్డాయి. వారం రోజుల క్రితం రైతు రమేష్ రావు రోజు మాదిరిగానే కోళ్ల ఫారం కు వెళ్లి చూడగా వందల సంఖ్యలో కోళ్లు మృతి చెంది కనిపించాయి. దీంతో వాటిని ట్రాక్టర్ లో తీసుకెళ్లి గ్రామానికి దూరంగా పడేసినట్లు పేర్కొన్నారు. 35 రోజుల వ్యవధిలో కోళ్లు మొత్తం మృతి చెందడంతో నాలుగు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. మండలంలోని ఇతర గ్రామంలో కూడా కొన్ని కోళ్ల ఫామ్ లో కూడా కోళ్లు మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. భారీ స్థాయిలో కోళ్ల చనిపోతుండడంతో ఇవి బర్డ్ ఫ్లూ కారణంగా చనిపోతున్నాయా లేక ఇంకా ఏదైనా వైరస్ సోకిందా అన్నట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

# వసతి గృహాల మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది..

**భీమవరం పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..**

**ఆడపిల్లలకు ఇబ్బంది లేని విధంగా టాయిలెట్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి..**

**వసతి గృహాలలో పారిశుద్ధ్య లోపం ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదు : జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**









భీమవరం: ఫిబ్రవరి 20,( శ్రీ చక్ర)ఎస్సీ బాలికల వసతి గృహంలో నిర్మిస్తున్న టాయిలెట్స్ ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, నిర్ణీత గడువులోపుగా పనులు పూర్తి కాకపోతేపోతే చెల్లింపులు నిలిపివేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత కాంట్రాక్టర్ ను హెచ్చరించారు.గురువారం భీమవరం పట్టణంలోని ఎస్సీ బాలికల, ఎస్టి బాలుర వసతి గృహాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత భీమవరం రైతు బజార్ దగ్గరలో ఒకే ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎస్సీ కాలేజీ విద్యార్థుల వసతిగృహం, ఎస్సీ చిన్నపిల్లల వసతి గృహం, బీసీ విద్యార్థుల వసతి గృహాలలో జరుగుచున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎస్సీ కాలేజీ విద్యార్థుల వినియోగానికి మున్సిపాలిటీ నిధులతో ఆరు నూతన టాయిలెట్స్, సంబంధిత పనులకు రూ.6 లక్షలు, బీసి వసతి గృహంలో పంపుసెట్టు ఏర్పాటు, టాయిలెట్స్ మరమత్తులకు ప్రభుత్వం రూ.1.35 లక్షలు, నిరంతరంగా నీటి సరఫరాకు సబ్మేరిజిబుల్ మోటార్ ఏర్పాటు, డోర్స్ మరమ్మతులు, ఫ్యాన్లు ఏర్పాటు, ఆరు టాయిలెట్ల నిర్మాణం, మూడు వసతి గృహాల్లోని 76 కిటికీలకు దోమలు రాకుండా మెస్ ఏర్పాటు, తదితర పనులకు ప్రభుత్వం రూ.6 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగింది. మున్సిపల్ నిధులతో కాంట్రాక్టర్, ప్రభుత్వ నిధులతో హౌసింగ్ శాఖ పనులను చేపట్టడం జరిగింది. తొలుత నూతనంగా నిర్మాణంలో ఉన్న టాయిలెట్లను పరిశీలించి ఎప్పటి లోపు పూర్తి చేస్తారని కాంటాక్ట్ ను ప్రశ్నించగా మార్చి 10 లోపు పనులు పూర్తవుతాయని బదులిచ్చారు. బాలికలకు ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బంది కలగకూడదని, నిర్ణీత గడువులోపు పనులు పూర్తి కాకపోతే చెల్లింపులు నిలిపివేస్తానని హెచ్చరించారు. అనంతరం అన్ని వసతి గృహాల్లోని డార్మెట్రీలను, టాయిలెట్స్ ను అణువణువునా పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. వసతి గృహం ఎల్లప్పుడూ అత్యంత పరిశుభ్రంగా ఉండాలని, అలాగే టాయిలెట్స్ కూడా చాలా శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. టాయిలెట్స్ లో గోడలను యాసిడ్, ఫినాయిల్ తో శుభ్రం చేయించాలని ఆదేశించారు. ప్రభుత్వం వసతి గృహాలలో మౌలికల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్ ను కేటాయించడం జరిగిందని, వసతి గృహ అధికారులు దగ్గర ఉండి అన్ని పనులను పూర్తి చేయించుకోవాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించగా, త్రాగునీటి అవసరం ఉందని, ఇన్వర్టర్లు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే మంచాలను అందజేయడం జరిగిందని, త్వరలో అన్ని పనులను పూర్తి చేస్తామని, బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని సూచించారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించేలా ఆడపిల్లలు మంచి వస్త్రధారణతో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇతర వ్యాపకాలను పక్కనపెట్టి చదువుపై దృష్టి సారించాలని, మీరు ప్రయోజకులు అయితే మీ తల్లిదండ్రులకు ఆర్థికంగా అండగా నిలుస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మీరు ప్రయోజకులైతే భవిష్యత్తులో మీ పిల్లలను కూడా ఉన్నతంగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం టిడ్కో గృహా సముదాయాల దగ్గరలో ఉన్న గునుపూడి ఎస్టీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ వసతి గృహం మౌలిక వసతుల అభివృద్ధికి రూ.5 లక్షలను కేటాయించడం జరిగింది. ఇప్పటికే డోర్స్, టాయిలెట్స్ మరమ్మతులు, తదితర పనులను పూర్తి చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ పనుల పరిశీలన అనంతరం హౌసింగ్ అధికారులతో మాట్లాడుతూ కొత్తగా డ్రైన్ నిర్మాణం, ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు, వాష్ ఏరియాలో బట్టలు ఉతుక్కోవడానికి బండలు నిర్మాణం, తదితర పనులను చేపట్టాలని సూచించారు. టాయిలెట్స్ ను యాసిడ్, ఫినాయిల్ తో క్లీన్ చేయించాలని వసతి గృహా అధికారిని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనం కొరకు వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. నేను ప్రకారం వండుతున్నారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వసతి ఏర్పాట్లను చేయడం జరిగిందని, వసతి గృహాల్లో చేరికలు పెరగాలని, ఈ విషయమై ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకుని ఆయా వర్గాల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సంబంధిత సంక్షేమ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహాల తనిఖీల సందర్భంలో భీమవరం మున్సిపల్ కమిషనర్ కె. రామచంద్రా రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి వై.హరిహరనాథ్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి బి.రామాంజనేయ రాజు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు, జిల్లా ఎస్టి సంక్షేమ శాఖ అధికారి డి.పుష్ప రాణి, వసతి గృహ అధికారులు సిహెచ్ భానుమణి, వై.పద్మజ, జి.శ్యామల, డి.శ్రీనివాసు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు బి.వెంకటరమణ, జి.పిచ్చయ్య, మున్సిపల్ ఇంజనీర్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయబోయే లూయిస్ బ్రెయిలీ విగ్రహావిష్కరణ కు సహకరిస్తా.!

ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి వి జయనాగేశ్వర రెడ్డి వెల్లడి,





ఎమ్మిగనూరు, ఫిబ్రవరి,20 (శ్రీ చక్ర):- ఎమ్మిగనూరు పట్టణంలోని ఎమ్మెల్యే బి వి.జయనాగేశ్వర రెడ్డి నివాసంలో రాష్ట్ర " దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘాల" గౌరవాధ్యక్షులు, మల్లేల గ్రూపు అధినేత, సామాజిక వేత్తల్లైడ్ రాజు అధ్యక్షతన కర్నూలు జిల్లా "విజువల్ ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్" (విసిఏ) జిల్లా అధ్యక్షులు ఎం. వీరేష్, రాష్ట్ర డిఈఎఫ్ అధ్యక్షులు బి సి.నాగరాజు కలవడం జరిగింది. ఈ సందర్భంగా విసిఏ డైరీ, 2016-వికలాంగుల హక్కుల చట్టం సూచికని ఎంఎల్ఏ ఆవిష్కరించడం జరిగింది, తదనంతరం మీడియా ముఖంగా మాట్లాడుతూ ఈ సందర్భంగా రాష్ట్ర "దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘాల" గౌరవాధ్యక్షులు, మల్లేల గ్రూపు అధినేత, సామాజిక వేత్తల్లైడ్ రాజు సారథ్యంలో త్వరలో కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేయబోయే "లూయిస్ బ్రెయిలీ" విగ్రహావిష్కరణ కు తగిన ఆర్థిక, సహాయ, సహకారాలు అందించాలని కోరగా ఎమ్మిగనూరు శాసనసభ్యులు బి వి.జయనాగేశ్వర రెడ్డి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఈ శివరాత్రి తర్వాత మన ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి దివ్యాంగులందరూ ఎన్డీఏ కూటమి భాగస్వాములైన టిడిపి జాతీయ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబునాయుడుని, జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ని, టిడిపి జాతీయ కార్యదర్శి, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ని, రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురంధేశ్వరి ని కలిసేందుకు చేపట్టబోయే దివ్యాంగుల కృతజ్ఞత ర్యాలీ కి సంబంధించిన తేదీలను ఖరారు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## గుడూరు మునిస్పల్ కమిషనర్ రమేష్ బాబుకు ఘన సన్మానం





గూడూరు, ఫిబ్రవరి 20(శ్రీచక్ర): గూడూరు నగర పంచాయతీ నూతన మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబుని మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాలు, పూలమాలలతో గురువారం ఘనంగా సత్కరించారు. టీడీపీ సీనియర్ నేత డి విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరుఏమ్మెల్యే బొగ్గుల దస్తగిరిల సహకారంతో మా నగర పంచాయతీని స్వాతంత్రానంతరం సుమారు 70 సంవత్సరాలు పరిపాలించిన ప్రతిపక్ష పార్టీల దిమ్మతిరిగేలా అభివృద్ధిలో పరుగులు పెట్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురుకుందు రామాంజనేయులు మాజీ వైస్ చైర్మన్, కడియాల గజేంద్ర గోపాల్ నాయుడు టౌన్ ప్రెసిడెంట్, దండు సుందరరాజు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్, మాదప్ప గారి గోరంట్ల బిజెపి మండల పార్టీ అధ్యక్షులు, సోమేశ్ జనసేన, బొజుగు పౌలు ల్, తెలుగు శీను, మన్సూర్ భాష, కౌన్సిలర్లు కలాం భాష ,మలాపు బుడనీగలి , కుమ్మరి ఎల్లయ్య, పుట్టపాశం రామాంజనేయులు కో ఆప్షన్ నెంబర్, మాజీ కౌన్సిలర్లు చాంద్ భాష, పైగేరి మధు, గురు అయ్యస్వామి టీ సీ నెంబర్, టీచర్ నాగరాజు, చికెన్ వహీద్ , ఎంఎల్నాగప్ప యాదవ్, మన్నన్ భాష, ఇబ్రహీం, రహిమాన్ , షేక్షావలి, పుట్టపాశం బాబు, మాదప్ప గారి హరికృష్ణ, రేమట హనుమంతు, పైగేరి రవి, చందు, ఇసాక్, బొజుగు సురేష్, కోల్ల రంగయ్య తదితర నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

## పోలిశెట్టి ఫౌండేషన్ ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ...!





కాజులూరు, ఫిబ్రవరి 20(శ్రీచక్ర)శ్రీ పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు మెమోరియల్ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో శ్రీమతి డొక్కా సీతమ్మ ఆసరా పథకం తరపున రామచంద్రపురం నియోజవర్గంలో పాలుచోట్ల 12 కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ మేరకు గురువారం రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలంలో చేదవాడ గ్రామంలోదడాల లక్ష్మీ, కాజులూరు గ్రామంలో వడ్డీ సత్యవతి, మడికి సత్యం, శీలంకలో దాసరి ఏసురత్నం, బంధనపూడిలో దడాల లాజరు, రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో కాకర విష్ణు మూర్తి, నెల పత్తిపాడులో పునుగు వీర్రాజు, ఓదూరులో తాతపూడి సామ్యూల్, చోడవరంలో అయినవిల్లి సత్యనారాయణ, వెల్ల గ్రామంలో కొమరపు లక్ష్మీ, తిరి గంగాభవాని, తాటిపల్లి గ్రామంలోపల్లెల బాలు,తదితర గ్రామాల్లో ఆయా చోట్ల మరణించిన వారి కుటుంబ సభ్యులను ట్రస్ట్ ఛైర్మెన్ పోలిశెట్టి చంద్రశేఖర్ ఆదేశాలు మేరకు జనసేన పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ నియోజకవర్గం ట్రస్ట్ కోఆర్డినేటర్ గుబ్బల శ్రీనివాస్, కె.గంగవరం మండల జనసేన పార్టీ అధ్యక్షులు చిర్రా రాజకుమార్, పోలిశెట్టి పెదబాబు పరామర్శించి వారికి ట్రస్ట్ ద్వారా నిత్యవసర సరుకులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ ప్రగతి లో ఘనంగా ఫుడ్ ఫియస్టా 2ఐ25







కోట ఫిబ్రవరి 20 (శ్రీచక్ర) : కోట పట్టణంలోని శ్రీ ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో ఫుడ్ ఫియస్టా 2ఐ25 కార్యక్రమాన్ని కోట ఎస్ ఐ పవన్ కుమార్ చేతులు మీదుగా ప్రారంభించారు.అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్ ను విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ తో కలిసి సందర్శించి విద్యార్థులు ప్రదర్శించిన ఆరోగ్యకరమైన వంటకాలను రుచి చూసి అభినందించారు.ముందుగా పౌష్టికాహారం గురించి చిన్నారులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడారు. విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ పౌస్టకాహారం గురించి విద్యార్థులు చిన్నతనం నుంచే అవగాహన కలిగిఉండాలి అని శారీరకంగా,ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండగలుగుతామని తద్వారా బాగా చదువుకొని ఉన్నత స్థానాలను చేరుకోగలమని అదేవిదంగా జంక్ ఫుడ్ కు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అని తెలియజేశారు.ముఖ్య అతిథి గా విచ్చేసిన ఎస్ ఐ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజాన్ని తయారుచేయడం కోసం విద్యార్థుల చేత ఇటువంటి వినూత్న కార్యక్రమం చేయడం అభినందనీయమని విద్యార్థులందరు చాలా రుచికరమైన దాదాపు పలు రకాల పౌష్టికాహారాలను తయారుచేసుకొచ్చారని అందుకు ముఖ్యంగా తల్లిదండ్రులను అభినందించారు.విద్యార్థులందరు ఆరోగ్యం పట్ల మంచి అవగాహన కలిగివుండి శారీరకంగా,మానసికంగా,దృడంగా ఉండి క్రమశిక్షణ తో బాగా చదువుకొని తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తేవాలని తెలియజేశారు.ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఇంత శ్రద్ధ చూపిస్తున్న చైర్మన్ పసుపులేటి.కిషోర్ ని, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

## ఘనంగా నేదురుమల్లి జనార్దన్ రెడ్డి జయంతి ఉత్సవాలు

## నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ఆశయాలను నెరవేర్చుతా...

**ఎన్బికేఆర్ విద్యా సంస్థల చైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి**









కోట ఫిబ్రవరి 20 (శ్రీచక్ర) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు స్వర్గీయ నేదురుమల్లి.జనార్దన్ రెడ్డి 90వ జయంతిని పురస్కరించుకుని విద్యానగర్ లోని నేదురుమల్లి. సుబ్బరామిరెడ్డి కళాభవన్ నందు నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించబడింది.ముందుగా ఫౌండేషన్ చైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి జనార్దన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలను కొనసాగించే భాగంలో ఆయన జన్మదినానికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఈ రక్తదాన కార్యక్రమంతో పాటు మరెన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తొందరలో ఎన్బికెఆర్ ఐ ఎస్ టి యూనివర్సిటీ ని చేస్తున్నట్లు తెలిపారు.ఆ తర్వాత రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించి రామ్ కుమార్ రెడ్డి కూడా రక్తదానం చేశారు.రక్తదాన కార్యక్రమానికి నెల్లూరు నుండి రెడ్ క్రాస్, సొసైటీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది,డిఎస్ఆర్ గవర్నమెంట్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది,గూడూరు నుంచి గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, మెడిపల్స్ బ్లడ్ సెంటర్ సిబ్బంది కలిసి దాతల నుంచి మొత్తం 830 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.ఈ కార్యక్రమంలో రామ్ కుమార్ రెడ్డితో పాటు జనార్దన్ రెడ్డి బంధువులు,అభిమానులు,స్నేహితులు ఎన్.బి.కె.ఆర్ విద్యాసంస్థల అధ్యాపకులు,విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరీగ.మురళి,ఎల్లసరి.గోపాల్ రెడ్డి, కొడవలూరు భక్తవత్సల రెడ్డి,దేవారెడ్డి నాగు రెడ్డి,వేమారెడ్డి షనీల్ కుమార్ రెడ్డి,ఎన్బికెఆర్ ఐ ఎస్ టి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్ కుమార్ రెడ్డి,వివిధ విభాగాధిపతులు, ఎన్.బి.కె.ఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి,మేనేజర్ రామకృష్ణారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# దాసరిపాడులో ఘనంగా ఘనంగా శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వార్షికోత్సవం...!

రామచంద్రపురం, ఫిబ్రవరి 20 (శ్రీచక్ర)వెంకటాయపాలెం గ్రామపంచాయతీ పరిధిలో దాసరి పాడు నందు వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి వారి 34వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈమేరకు గురువారం రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్ కుమారి రవికుమార్ దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి రథోత్సవం వందలాది భక్తులు నడుము నేత్రపర్వంగా కోనసాగింది.కార్యక్రమానికి భారీ ఎత్తున విద్యుత్ దీపాలంకరణ చేయగా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అలంకరణ మెరుమిట్లు గొలిపింది అలాగే దాతలు ,గ్రామ పెద్దలు సహకారంతో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.





# ప్రకృతి వ్యవసాయంలో నవ ధాన్యాల ప్రాముఖ్యత, డ్రోన్ ద్వారా కషాయాల పిచికారి, ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం

ఆకివీడు /భీమవరం ఫిబ్రవరి 20 (శ్రీ చక్ర ).ఆకివీడు, ఆంధ్రప్రదేశ్ ? ఆకివీడు మండలంలో చిన్నమిల్లిపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం గురువారం ప్రారంభించడం ఆ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయంలో నవ ధాన్యాల ప్రాముఖ్యతను జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నూకరాజు వివరించారు. అలాగే, డ్రోన్ ద్వారా కషాయాల ద్రావణాలను పిచికారి చేయించారు. నూకరాజు మాట్లాడుతూ, పిఎండిఎస్ నవ ధాన్యాలు తొమ్మిది రకాల జాతుల పంటల విత్తనాలు అని, ఇవి రైతులు అనేక ప్రయోజనాలను అందిస్తాయిఅని పేర్కొన్నారు. దీనివల్ల నేల ఆరోగ్యం మెరుగుపడుతుంది,. నీటి వినియోగం తగ్గుతుంది., తెగుళ్లు మరియు వ్యాధుల బారి నుండి పంటలకు రక్షణ లభిస్తుంది. దిగుబడి పెరుగుతుందన్నారు.డ్రోన్ ద్వారా కషాయాల పిచికారి చేయడం వల్ల సమయం శ్రమ ఆదా అవుతుందని నూకరాజు తెలిపారు. అలాగే, ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయానికి







సంబంధించిన కషాయాలు ద్రావణాలుమరియు పకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా, సమాచారం,సహాయం అందుబాటులో ఉంటుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ పకృతి వ్యవసాయం పర్యావరణానికి మరియు మానవుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. రైతులు పకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో అరుణ కుమారి ఎన్పీఎం ఎం.టి. రవి కుమార్ , డిఎంఎంటి రమణమ్మ, మండలి ఇంచార్జ్ మూల రాజేశ్వరి ఐ సి ఆర్ పి లు తదితరులు పాల్గొన్నారు

# 24న రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల నిరసన

**-టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు**

**-సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 20, (శ్రీచక్ర )జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద జర్నలిస్టులు నిరసన తెలియజేస్తూ కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. జర్నలిస్టులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది. హైదరాబాద్ లో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య గత కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణ పై నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన ఫెడరేషన్ ఆఫీస్ బేరర్లు,కార్యవర్గ సభ్యులు ఆయా అంశాలపై దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలతో పాటు తక్షణం పరిష్కరించాల్సిన పలు అంశాలపై పై సమావేశంలో చర్చించి తీర్మానాలు చేశారు. సమావేశం ఆమోదించిన తీర్మానాలను ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య గురువారం మీడియాకు విడుదల చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీం, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు, చిన్న,మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు, జర్నలిస్టుల ప్రత్యేక రక్షణ చట్టం తదితర డిమాండ్ల పరిష్కారాని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేస్తూ తీర్మానించిందని తెలిపారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంత వరకు ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని అన్నారు. జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వకుండా జీవో 239 సమీక్ష, సవరణ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నదనీ,దీని వల్ల జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని వాఖ్యానించారు.జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి కొత్త ప్రభుత్వానికి ఏడాదిగా సమయం ఉన్నా, ఇంత వరకు పరిష్కరించ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఈనెల ఫిబ్రవరి 25 నుంచి మార్చి 25వ తేదీ వరకు నెల రోజుల పాటు ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని సమావేశం తీర్మాణం చేసింది.అన్ని జిల్లాల్లో సభ్యత్వ నమోదు జరుగుతుందని, జర్నలిస్టులంతా ఐక్యత, హక్కుల సాధన కోసం ఫెడరేషన్ లో సభ్యులుగా చేరి భవిష్యత్తు కార్యాచరణలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత అన్ని జిల్లాల ఫెడరేషన్ మహాసభలు నిర్వహించాలని, మార్చి 29న రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం జరపాలని సమావేశం నిర్ణయించినట్లు వారు తెలిపారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, బండి విజయ్ కుమార్, గుడిగ రఘు, కొప్పు నిరంజన్, విజయానంద్,కోశాధికారి రాచమల్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శులు సలీమా, తన్నీరు శ్రీనివాస్, కర్రా అనిల్ రెడ్డి, ఈ. చంద్రశేఖర్, జగదీష్,రాజశేఖర్,మానిక్ ప్రభు,నవీన్,కార్యవర్గ సభ్యులు మణిమాల, కె. పాండురంగారావు ,నాయిని శ్రీనివాస రావు పి నాగవాణి,పరిపూర్ణం, రమేష్, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

# తెరపైకి బుక్ ట్రెండ్స్...

హైదరాబాద్, ఫిబ్రవరి 20, (శ్రీచక్ర) ఏపీలో రెడ్ బుక్, తెలంగాణలో పింక్ బుక్, ఇప్పుడు కాషాయ బుక్.. తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా పొలిటికల్ బుక్స్ ట్రెండ్..ఉండేది ఐదేళ్లే అన్నారు ఈటల రాజేందర్. తాము కాషాయ బుక్ ను మెయింటేన్ చేస్తున్నామని, తమను ఇబ్బంది పెడుతున్న వారికి కచ్చితంగా తగిన పరిణామాలు ఉంటాయని ఈటల హెచ్చరించారు.టీడీపీ నేత నారా లోకేశ్ రెడ్ బుక్ తో ఏపీలో మొదలైన ఈ అపోజిషన్ బుక్ ట్రెండ్.. ఇప్పుడు తెలంగాణలో ఎంట్రీ ఇచ్చింది. పింక్ బుక్ రెడీ చేస్తామని ఇటీవలే కవిత ప్రకటన చేశారు. తాజాగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. కాషాయ బుక్ ను తెరపైకి తెచ్చారు. తాము కాషాయ బుక్ ను మెయింటేన్ చేస్తున్నామని, తమను ఇబ్బంది పెడుతున్న వారికి కచ్చితంగా తగిన పరిణామాలు ఉంటాయని ఈటల హెచ్చరించారు.ప్రభుత్వాలు ఉండేది ఐదేళ్లే అన్నారు ఈటల రాజేందర్. అయితే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉండేది 35 ఏళ్లు అని ఈటల చెప్పారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో ఎంతోమంది ఉద్దండులను తాము చూశామన్నారు. ఐఏఎస్ లు బానిసల్లా పని చేయొద్దని, గతంలో అలా పని చేసిన వారు జైలు పాలయ్యారని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని నడిపే నాయకుడికి అనుగుణంగా పనితీరు ఉంటుందని, సీఎంతో పాటు వారి బంధు మిత్రుల ఒత్తిడికి తలొగ్గదని ఆయన సూచించారు.ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ జిల్లాలో ఈటల పర్యటించారు. మీడియాతో మాట్లాడిన ఈటల.. ఐఏఎస్, ఐపీఎస్ లను ఉద్దేశించి వార్నింగ్ ఇచ్చారు. అధికారులు చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. బాసుల ఆదేశాలు పాటించడం కాకుండా నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు.లేదంటే శ్రీలక్ష్మి సహా కొందరు అధికారులకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. మేము కూడా ఆరెంజ్ బుక్ మెయింటేన్ చేస్తున్నామన్నారు. ఆ బుక్‌లో అందరి పేర్లు రాసుకుంటున్నామన్న ఈటల.. సమయం వచ్చినప్పుడు లెక్కలతో సహా బయటపెడతామని వార్నింగ్ ఇచ్చారు ఈటల. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని అన్నారు.

# కోట ఆర్టీసీ కార్గో పార్శిల్ లో అధిక మొత్తంలో వసూలు

కోట ఫిబ్రవరి 20 (శ్రీచక్ర ): కోట మండలంలోని స్థానిక ఏపీఎస్ఆర్టీసీ నందు ఉన్న కార్గో పార్సెల్ లో భాగంగా అధిక మొత్తంలో నిర్వాహకులు వసూలు చేస్తున్నట్లు ఆర్టిసి డిఎం కు,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. గత ఐదు నెలల నుండి కోట ఆర్టీసీ బస్టాండ్ నందు ఆర్టిసి కార్గో సేవలు అందిస్తున్నారు.అయితే అధిక మొత్తం భాగంలో ఎల్ ఆర్ బుక్ చేసినప్పుడు, రిసీవింగ్ పార్సలను తీసుకునేటప్పుడు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని పలువురు తమ దృష్టికి తీసుకొచ్చారని పనబాక కోటేశ్వరరావు తెలిపారు. అదేవిధంగా అధిక మొత్తంలో వసూలు చేస్తున్న వారిపై సమగ్రంగా విచారించి ఆర్టీసీ డిఎం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రతి డెలివరీ వస్తువుపై ఆధారంగా ?20 లను తీసుకుంటున్నారని వాపోయారు.

## చిన్నారుల్లో జ్ఞానజ్యోతిని వెలిగిద్దాం అంగన్వాడి కార్యకర్తలకు వివరిస్తున్న సూపర్వైజర్ కవిత

కోట ఫిబ్రవరి 20 (శ్రీచక్ర) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు చిన్నారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి జ్ఞానమనే జ్యోతిని వెలిగించడం ద్వారా భావి భారతంలో అత్యుత్తమ పౌరులుగా తీర్చి దిద్దుదామని అంగన్వాడి సిడిపిఓ ముని కుమారి సూపర్వైజర్ కవిత లు అన్నారు. ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని కోట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరు రోజుల జ్ఞానజ్యోతి? శిక్షణ తరగతులలో అంగన్వాడి సిడిపివో మణికుమారి సమక్షంలో సూపర్వైజర్ కవిత అంగన్వాడీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్నీ కేంద్రాల అంగన్వాడీ కార్యకర్తలకు బాల్య ఆరంభ దశ విద్యా విధానం ఆవశ్యకతను వివరించారు.అంగన్వాడీ దశ నుంచే చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించి ఆటపాటలలో శిక్షణ ఇచ్చి తెలుగు భాషపై మమకారం,మక్కువ సాధించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. అంగన్వాడీలోని చిన్నారుల అభ్యున్నతి కోసం గ్రామాల్లో త్వరలో ప్రారంభమయ్యే ఫౌండేషన్ స్కూల్స్ ఏర్పాటు జరుగుతుందన్నారు.ప్రీ స్కూల్ దశ నుంచి ప్రైమరీ,హైస్కూల్,కాలేజీ దశ వరకూ చక్కని విద్యను అందించేందుకు ఈశిక్షణ తోడ్పాటును అందిస్తుందన్నారు. చిన్నారులకు బాల్య దశ నుంచే అల్లారు ముద్దుగా పెంచి చక్కని విద్యను భోధించే అవకాశం అంగన్వాడీ లకు దక్కుతుందని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు రాజేశ్వరి,రూప, తదితర అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.






# స్పోర్ట్స్ న్యూస్

## ఇండియాతో మ్యాచ్‌కు.. పాక్ ఓపెనర్ ఫకర్ జమాన్ దూరం



కరాచీ: పాకిస్థాన్ ఓపెనింగ్ బ్యాటర్ ఫకర్ జమాన్ చాంపియన్స్ ట్రోఫీలో ఆదివారం భారత్‌తో జరగనున్న వన్డే మ్యాచ్‌కు దూరం అయ్యాడు. బుధవారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో.. ఫకర్ జమాన్ గాయపడ్డ విషయం తెలిసిందే. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపబోయిన అతను.. కిందపడి గాయపడ్డాడు. అయితే ఫిబ్రవరి 19వ తేదీన భారత్‌తో జరిగే కీలకమైన మ్యాచ్‌కు అతను దూరం అయ్యాడు. భారత్ తన మ్యాచులన్నీ దుబాయ్‌లో ఆడుతున్న విషయం తెలిసిందే. కరాచీ నుంచి ఇవాళ పాకిస్థాన్ జట్టు దుబాయ్‌కు బయలుదేరి వెళ్లింది. ఆ బృందంలో గాయపడ్డ ఫకర్ జమాన్ లేడు. దీంతో రెగ్యులర్ ఓపెనర్‌ను పాక్ జట్టు కోల్పోయింది. కివీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫకర్ జమాన్.. ఓపెనింగ్ బ్యాటింగ్ చేయలేకపోయాడు. అతని స్థానంలో సౌద్ షకీల్ ఓపెనర్‌గా వచ్చాడు. నెంబర్ ఫోర్ స్థానంలో బ్యాటింగ్ చేసిన ఫకర్ జమాన్.. 41 బంతుల్లో 24 రన్స్ చేసి ఔటయ్యాడు. బ్యాటింగ్ చేస్తున్న సమయంలో అతను తీవ్ర ఇబ్బంది పడ్డాడు. కివీస్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు 60 రన్స్ తేడాతో ఓడింది. ఫకర్ జమాన్ గురించి అంతర్జాతీయ క్రికెట్ మండలి త్వరలో ప్రకటన చేయనున్నట్లు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. చాంపియన్స్ ట్రోఫీ కోసం ఫకర్ జమాన్.. మళ్లీ ఓపెనర్‌గా ఎంపికయ్యాడు. అతను చివరిసారి 2023 వరల్డ్‌కప్‌లో ఓపెనర్‌గా ఆడాడు. తరుచూ ఫకర్ జమాన్ మోకాలి నొప్పులతో బాధపడుతున్నాడు. జమాన్ స్థానంలో ఓపెనర్‌గా ఇమామ్ ఉల్ హక్‌ను తీసుకునే ఛాన్సు ఉంది. పాకిస్థాన్ జట్టులో దూకుడు బ్యాటర్‌గా ఫకర్ జమాన్‌కు గుర్తింపు ఉన్నది. ఇండియాతో మ్యాచ్‌కు అతను దూరం కావడంతో.. పాక్ బ్యాటింగ్ ఆర్డర్‌కు మళ్లీ కొత్త సమస్యలు వచ్చినట్లు అయ్యింది.

## క్రికెట్ అభిమానులకు రోహిత్ శర్మ సందేశం..



దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఇవాళ బంగ్లాదేశ్‌తో ఇండియా ఆడనున్నది. అయితే మ్యాచ్ ప్రారంభానికి ముందు రోహిత్ శర్మ వీడియోను బీసీసీఐ తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది. భారతీయ క్రికెట్ అభిమానులకు రోహిత్ ఓ అపీల చేశారు. ఎప్పటి తరహాలోనే టీమిండియాకు మద్దతు ఇవ్వాలని కోరారు. చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. బార్బడోస్ నుంచి తమను చాంపియన్లుగా చూస్తున్నారని, మన దేశాన్ని, జట్టును, చాంపియన్‌గా మార్చేందుకు .. మీరు మాతో ఉండాలని రోహిత్ ఆ వీడియోలో పేర్కొన్నారు. మనం అందరం చాంపియన్లు అవుదామన్నారు. బార్బడోస్‌లో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌ను ఇండియా గెలిచిన విషయం తెలిసిందే.

## భారత్, బంగ్లా మ్యాచ్‌లో బద్దలయ్యే రికార్డులు ఇవే.. లిస్ట్‌లో కోహ్లీ, రోహిత్

గురువారం దుబాయ్‌లోని దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో భారత్, బంగ్లాదేశ్ జట్లు తలపడుతున్నాయి. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో రెండో మ్యాచ్‌లో ఇరుజట్లు తలపడుతున్నాయి. రెండు ఉపఖండ పొరుగు జట్లు ఒకదానికొకటి తలపడుతున్నందున, మ్యాచ్ సమయంలో అనేక రికార్డులు బద్దలయ్యే అవకాశం ఉంది. అవేంటో ఓసారి చూద్దాం..1) కోహ్లీ 14 వేల పరుగుల మైలురాయిని చేరుకుంటాడు ? సచిన్ టెండూల్కర్ (18,426), శ్రీలంకకు చెందిన కుమార్ సంగక్కర (14,234) తర్వాత వన్డే ఫార్మాట్‌లో 14,000 పరుగులు చేసిన మూడో బ్యాట్స్‌మన్‌గా నిలిచేందుకు విరాట్ కోహ్లీ కేవలం 37 పరుగుల దూరంలో ఉన్నాడు. కోహ్లీ ఈ మైలురాయిని వేగంగా చేరుకునేందుకు సిద్ధంగా ఉన్నాడు. టెండూల్కర్ 350 ఇన్నింగ్స్‌లలో ఈ మైలురాయిని చేరుకోగా, సంగక్కర 378 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించాడు. 2) రోహిత్ 11 వేల పరుగులు ? రోహిత్ శర్మ 11,000 వన్డే పరుగులు సాధించే నాల్గవ బ్యాట్స్‌మన్‌గా అవతరించడానికి, ప్రపంచంలో 10వ బ్యాట్స్‌మన్‌గా నిలిచిందేకు మరో 12 పరుగుల దూరంలో ఉన్నాడు. రోహిత్ ఇప్పటివరకు 260 ఇన్నింగ్స్‌లు ఆడాడు. టెండూల్కర్ (276 ఇన్నింగ్స్‌లు)ను అధిగమించి ఈ మైలురాయిని చేరుకున్న రెండవ అత్యంత వేగవంతమైన బ్యాట్స్‌మన్‌గా అవతరించే అవకాశం ఉంది. కోహ్లీ (222 ఇన్నింగ్స్‌లు) ఈ మైలురాయిని అత్యంత వేగంగా చేరుకున్న బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు.




## టీమిండియా మ్యాచ్‌కు అదే పరిస్థితి.. దుబాయ్ స్టేడియంలో ఖాళీ కుర్చీలు!

దాదాపు 8 ఏళ్ల తర్వాత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ లకు కళ తప్పింది. పాకిస్థాన్ కరాచీ వేదికగా జరిగిన ఓపెనింగ్ మ్యాచ్ కు ప్రేక్షకులు రాక స్టేడియం వెలవెలబోయిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు దుబాయ్ ఇండర్నేషనల్ స్టేడియం వేదికగా జరుగుతున్న టీమిండియా - బంగ్లాదేశ్ మ్యాచ్ కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. స్టేడియంలో ఖాళీ స్టాండ్ లు దర్శనమిచ్చాయి. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. చాలా వరకు ఖాళీగా కుర్చీలు.. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫిబ్రవరి 19న ఘనంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ మెగా టోర్నీలో భాగంగా రెండో మ్యాచ్ టీమిండియా - బంగ్లాదేశ్ మధ్య జరుగుతోంది. ఈ మ్యాచ్ లో ఎలాగైనా గెలిచి... విజయంతో టోర్నీని ఆరంభించాలని ఇరు జట్లు పట్టుదలతో ఆడుతున్నాయి. కానీ వారికి అభిమానుల నుంచి మద్దతు కరువైంది. సోషల్ మీడియా వేదికగా వారికి సపోర్ట్ ఇచ్చే వాళ్లు ఉన్నా.. నేరుగా స్టేడియానికి వచ్చి మద్దతు ఇచ్చే ప్రేక్షకులు కరువయ్యారు. స్టేడియం సామర్థ్యం 25 వేల మంది కాగా, స్టాండ్స్ లో చాలా వారకు ఖాళీ కుర్చీలు కనిపించాయి. ఆరంభ మ్యాచ్ అంటే పాకిస్థాన్ - న్యూజిలాండ్ కాబట్టి ప్రేక్షకులు రాలేదనుకుంటే.. అగ్రజట్టైన టీమిండియా ఆడే మ్యాచ్ కు అభిమానులు లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పైగా దుబాయ్ లో భారత్ కు చెందిన జనాభా చాలా మందే ఉంటారు. కానీ వారంతా కూడా స్టేడియానికి రాకపోవడంతో క్రికెట్ అభిమానులు షాక్ అవుతున్నారు. సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు, క్రికెట్ ఫ్యాన్స్ అయితే ఎందుకిలా జరిగిందంటూ.. మ్యాచ్, స్టేడియం నిర్వాహకులపై మండిపతున్నారు.



## క్లిష్ట పరిస్థితుల నుంచి రక్షించినందుకు దేవుడికి కృతజ్ఞతలు.. విడాకుల రూమర్స్ వేళ చాహల్ పోస్ట్




భారత స్టార్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ ధనశ్రీ వర్మ జంట విడాకులు తీసుకోబోతోందంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయని, విడిపోయేందుకు నిర్ణయించుకున్నారంటూ ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో విడాకుల పుకార్ల మధ్య చాహల్ తాజాగా ఓ పోస్ట్ పెట్టాడు. తనను క్లిష్ట పరిస్థితుల నుంచి రక్షించినందుకు దేవుడికి కృతజ్ఞతలు తెలుపుతూ ఇన్‌స్టా స్టోరీస్‌లో పోస్టు పెట్టాడు. అయితే.. ఆ పరిస్థితులు ఏంటన్నది ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. చాహల్.. దంత వైద్యురాలైన ధనశ్రీ 2020 డిసెంబర్ 22న పెండ్లి చేసుకున్నారు. కొరియోగ్రాఫర్‌గా, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది ధనశ్రీ. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ ఇన్‌స్టాలో రీల్స్ చేస్తూ ఫ్యాన్స్‌ను అలరిస్తూనే ఉన్నారు. అయితే, ఇటీవలే ధనశ్రీ తన పేరు నుంచి 'చాహల్' నేమ్‌ను తీసేయడంతో ఈ జంట విడాకులు తీసుకోబోతోందంటూ పుకార్లు వ్యాపించాయి. ఆ తర్వాత చాహల్ సైతం 'న్యూ లైఫ్ లోడెడ్' అంటూ ఇన్‌స్టా స్టోరీస్‌లో రాసుకొచ్చాడు. దీంతో వీరు విడాకులు తీసుకోవడం ఖాయం అని ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే వీరు తమ సోషల్ మీడియా ఖాతాలో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడంతో ఆ వార్తలకు మరింత ఆజ్యంపోసినట్లైంది. ఈ క్రమంలో ధనశ్రీకి భరణంగా రూ.60 కోట్లు చెల్లించేందుకు చాహల్ సిద్ధమయ్యాడని వార్తలు కూడా చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఈ వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## అక్షర్ పటేల్ హ్యాట్రిక్ మిస్.. క్యాచ్ వదిలేసిన రోహిత్ శర్మ..




దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో స్పిన్నర్ అక్షర్ పటేల్‌కు హ్యాట్రిక్ వికెట్లు తీసే ఛాన్సు మిస్సైంది. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో.. అక్షర్ పటేల్ తన తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు తీసుకున్నాడు. అయితే ఆ ఓవర్‌లో హ్యాట్రిక్ వికెట్లు తీసే ఛాన్సు మిస్ చేసుకున్నాడు. రెండో బంతికి తంజిద్ హసన్‌ను ఔట్ చేసిన అక్షర్.. ఆ తర్వాత మూడో బంతికి ముష్ఫికర్ రహీమ్‌ను ఔట్ చేశాడు. ఆ ఇద్దరూ కీపర్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగారు. అయితే నాలుగో బంతికి జకీర్ అలీ ఇచ్చిన క్యాచ్‌ను.. ఫస్ట్ స్లిప్‌లో ఉన్న రోహిత్ శర్మ మిస్ చేశాడు. ఈజీగా వచ్చిన ఆ క్యాచ్‌ను అతను అందుకోలేకపోయాడు. దీంతో అక్షర్‌కు హ్యాట్రిక్ మిస్సైంది. ఫస్ట్ బ్యాటింగ్ చేస్తున్న బంగ్లాదేశ్ తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నది. ఆ జట్టు టాప్ ఆర్డర్ పెద్దగా స్కోర్ చేయలేదు. కేవలం తంజిద్ హసన్ మాత్రమే 25 రన్స్ స్కోర్ చేసి ఔటయ్యాడు. తాజా సమాచారం ప్రకారం.. బంగ్లాదేశ్ 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 39 రన్స్ చేసింది.

## చాంపియన్స్ ట్రోఫీ.. టాస్ ఓడిన ఇండియా.. బంగ్లాదేశ్ ఫస్ట్ బ్యాటింగ్

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌తో జరగనున్న వన్డే(ఃంఔలఎఔఅ)లో.. టాస్ గెలిచిన బంగ్లాదేశ్ జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నది. పేస్ బౌలర్ హర్షదీప్ సింగ్, స్పిన్నర్ వరున్ చక్రవర్తిని తుది జట్టుకు ఎంపిక చేయలేదు. హర్షిత్ రాణా, షమీలు పేస్ బౌలింగ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు స్థానం కల్పించారు. ఒకవేళ టాస్ గెలిస్తే, ముందుగా ఫీల్డింగ్ ఎంచుకునేవాళ్లమని రోహిత్ పేర్కొన్నాడు. దుబాయ్ పిచ్‌లో సెకండ్ బ్యాటింగ్ ఈజీగా ఉంటుందని పేర్కొన్నాడు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ జట్టులోకి వచ్చేశాడు. ఈ మ్యాచ్‌కు ముగ్గురు స్పిన్నర్లతో ఇండియా బరిలోకి దిగుతున్నది. జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్.. బౌలింగ్ లైనప్‌లో ఉన్నారు. జడేజా, అక్షర్ ఆల్‌రౌండర్లు కాగా, కుల్దీప్ తన మణికట్టుతో మాయ చేయనున్నాడు. ముగ్గురు పేస్ బౌలర్లు, ఇద్దరు స్పిన్నర్లతో .. బంగ్లాదేశ్ ఆడుతోంది. నహిద్ రాణాకు బదులుగా తంజిమ్ హసన్‌ను జట్టులోకి తీసుకున్నారు.



# ఈ 8 రకాల పానీయాలలో ఏ ఒక్కటి తాగినా మీకు గాఢంగా నిద్రపడుతుంది




మనలో చాలా మంది నిద్ర లేమితో బాధపడుతున్నారు. ఒక వ్యక్తికి తగినంత నిద్ర రాకపోతే, అది అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. దీనికి ప్రధాన కారణం పేలవమైన జీవనశైలి మరియు ఒత్తిడి. మీరు నిద్ర సమస్యతో బాధపడుతూ, దానిని గమనించకుండా వదిలేస్తే, అది పెద్ద పరిణామాలను కలిగిస్తుంది. కాబట్టి మీకు నిద్రించడానికి ఇబ్బంది ఉంటే, దాన్ని పరిష్కరించడానికి ప్రయత్నించండి. నిద్ర ప్రాముఖ్యతను వైద్యులు మరియు ఆరోగ్య నిపుణులు మనకు నొక్కి చెబుతున్నా, చాలా తరచుగా మనం దానిపై రాజీ పడటం లేదు. అర్ధరాత్రి వరకు టీవీ చూడటం, మొబైల్ వాడటం, ఒత్తిడి, పని లేదా నిద్ర పట్టకపోవడం ఇలా అనేక కారణాల వల్ల చాలా మంది నిద్రలేమి సమస్యతో బాధపడుతుంటారు. రాత్రి సమయంలో మంచి నిద్ర పొందడానికి మీకు సహాయపడే కొన్ని పానీయాలు ఇక్కడ ఉన్నాయి. అదృష్టం కొద్దీ ఈ పానీయాలను సాధారణ పదార్థాలతో నిద్రకు సహాయపడే పానీయాలను తయారు చేయవచ్చు. కాబట్టి మీరు రాత్రి సమయంలో నిద్ర పట్టనప్పుడు ఈ పానియాల్లో ఏ ఒక్కదానిని త్రాగినా చాలు మీకు బాగా గాఢంగా నిద్ర పడుతుంది. వెచ్చని పాలువెచ్చని పాలునిద్రించడానికి ముందు గోరువెచ్చని పాలు త్రాగడం పురాతకాలం నుండి వస్తున్న సంప్రదాయం. ఇది మంచి నిద్రను పొందడానికి సహజమైన నివారణగా పనిచేస్తుంది. పాలలో ఉండే ట్రిప్టోఫాన్ అని పిలువబడే అమైనో ఆమ్లాన్ని కలిగి ఉంటుంది, పాలను త్రాగినప్పుడు ఇది మెలటోనిన్ అనే హార్మోన్‌గా మార్చబడుతుంది, ఇది మీ సహజ నిద్ర స్థితిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఒత్తిడి మరియు నిద్రలేమి వంటి నిద్ర రుగ్మతలను ఎదుర్కోవడం ద్వారా మెలటోనిన్ నిద్రను ప్రోత్సహిస్తుంది. పాలు వెచ్చగా ఉండటానికి కారణం అది గొంతు మరియు శరీరంలోని మిగిలిన భాగాలకు ఓదార్పునిస్తుంది. చమోమిలే టీచమోమిలే టీంటను తగ్గించడం మరియు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం వంటి ఆరోగ్య ప్రయోజనాల గురించి గొప్పగా చెప్పుకోవడమే కాకుండా, చమోమిలే టీ నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. రోజూ చమోమిలే టీ తాగే వారు నిద్ర లోపం శారీరక లక్షణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్లస్ పాయింట్ ఏమిటంటే, చాలా టీల మాదిరిగా కాకుండా, చమోమిలే టీ కెఫిన్ లేకుండా ఉంటుంది, ఇది ప్రశాంతమైన మరియు మరింత ఓదార్పు పానీయంగా మారుతుంది. కొబ్బరి నీళ్ళుకొబ్బరి నీళ్ళుకొబ్బరి నీరు మెగ్నీషియం మరియు పొటాషియం, కండరాలను సడలించే రెండు ఖనిజాలతో నిండి ఉంది. ఇది శరీరాన్ని శాంతపరచడంలో సహాయపడుతుంది మరియు సులభంగా మరియు సౌకర్యవంతమైన నిద్రను అనుమతిస్తుంది. అంతేకాక, కొబ్బరి నీటిలో






విటమిన్ బి ఉంటుంది, ఇది ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుంది. పుదీనా టీ టీపిప్పరమింట్ టీలో ఉన్న మెంతోల్ యాంటిస్పాస్మోడిక్ స్వభావం శారీరక లేదా మానసిక ఒత్తిడికి గురైనప్పుడు మీ కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి సహాయపడుతుంది. దీని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, ఇది రాత్రిపూట నిద్రకు ఆటంకం కలిగించే గౌట్ అసౌకర్యాన్ని తగ్గిస్తుంది. పొటాషియం మరియు విటమిన్ బి లు కూడా ఒత్తిడిని తగ్గించడానికి మరియు కండరాలను సడలించడానికి కూడా సహాయపడతాయి మరియు మంచి పిప్పరమింట్ యొక్క గొప్ప గుణం ఏంటంటే, ఇందులో కెఫిన్ ఉండదు. పాలు మరియు పసుపుపాలు మరియు పసుపుపసుపులో కర్కుమిన్ అనే సమ్మేళనం ఉంది, ఇది నిద్ర లేమికి కారణాలయ్యే ఆందోళన మరియు నిరాశ వంటివి తగ్గిస్తుంది. పసుపులోని కుర్కుమిన్స్ పాలలో ఉన్న ట్రిప్టోఫాన్తో కలిసి శరీరం విశ్రాంతిగా నిద్రించడానికి –తిరిగి నిద్రలేచే విధంగా పనిచేస్తుంది, ఈ పానీయం రాత్రి మంచి నిద్ర పొందడానికి మరియు సౌకర్యంగా నిద్రపోవడానికి గొప్ప మార్గం. చెర్రీ జ్యూస్చెర్రీ జ్యూస్మీరు ఈ చెర్రీ రసాన్ని ఉదయం మరియు రాత్రి టంబ్లర్‌తో తాగితే, చెర్రీలోని అదనపు మెలటోనిన్ నిద్ర లేమి చక్రాన్ని రివర్స్ చేస్తుంది. చెర్రీస్ లో ఉండే ట్రిప్టోఫాన్ మరియు మెలటోనిన్లు పుష్కలంగా ఉండటం వల్ల రాత్రి నిద్రించడానికి ముందు ఒక గ్లాస్ చెర్రీ జ్యూస్ త్రాగాలి. ఇది మీ నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. ఇది చాలా రకాల్లో వస్తుంది, కాని టార్ట్ రకం మెలటోనిన్ అత్యధిక మొత్తంలో ప్యాక్ చేస్తుంది, కాబట్టి ఆ చెర్రీలను కొనడానికి ప్రయత్నించండి. చెర్రీస్ కాలానుగుణమైనవి, కాబట్టి దాని స్వింగ్‌లో ఉన్నప్పుడు దాని నిద్రను ప్రేరేపించే లక్షణాలను ఉపయోగించుకోవడానికి ప్రయత్నించండి. బనానా స్మూతీబనానా స్మూతీ అరటిపండ్లు రోజులో ఏ సమయంలోనైనా మంచి చిరుతిండిగా తీసుకోవచ్చు మరియు నిద్రించడానికి ముందు స్మూతీలా తయారుచేసి తాగడం వల్ల చాలా హాయిగా నిద్రపడుతుంది. అరటి పండులో మెగ్నీషియం మరియు పొటాషియంలు అధికంగా ఉన్నాయి. ఇవి కండరాల సడలింపు కు సహాయపడుతాయి. దాంతో మీరు ప్రశాంతంగా నిద్రపోతారు. అమైనో ఆమ్లం ట్రిప్టోఫాన్ మరియు మెలటోనిన్ కూడా ఉన్నాయి, ఈ రెండూ నిద్ర నియంత్రణను ప్రోత్సహిస్తాయి. బాదం పాలుబాదం పాలుబాదం పాలను మొత్తం బాదంపప్పుతో తయారు చేస్తారు, ఈ పాలు అధిక పోషకాలతో నిండి ఉంటుంది, ఇవి ఆరోగ్య ప్రయోజనాలను సమృద్ధిగా అందిస్తాయి. ప్రయోజనాలలో ఒకటి మంచి నిద్రకు సహాయపడుతుంది,

# బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నవారు పగటిపూట ఎంత అన్నం మరియు ఎన్ని చపాతీలు తీసుకోవాలి?



భారతీయ ఆహారంలో బియ్యం మరియు గోధుమలు రెండూ ముఖ్యమైన మరియు సమగ్ర పాత్రను కలిగి ఉన్న ఆహార పదార్థాలు, ఇవి లేకుండా భారతీయ ఆహారం అసంపూర్ణం కాదు! కానీ బరువు తగ్గే విషయానికి వస్తే, మొదట ఈ రెండు ఆహారాలపైనే కన్ను పడుతుంది. ఈ రెండూ కార్బోహైడ్రేట్లతో నిండి ఉన్నందున, మీరు బరువు తగ్గడానికి కార్బోహైడ్రేట్లను తగ్గించాలి. భారతీయ వంటకాల్లో మనం నిత్యం తీసుకునే ఆహారాల్లో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉన్నాయని, ప్రోటీన్ తక్కువగా ఉందని దక్షిణ ముంబైలోని డైటరీ కన్సల్టెంట్ నీతి దేశాయ్ వివరించారు. బరువు తగ్గడానికి, మీరు ప్రోటీన్ ఎక్కువగా తీసుకోవాలి మరియు కార్బోహైడ్రేట్లను తగ్గించాలి. అందువల్ల, తక్కువ కార్బోహైడ్రేట్లతో కూడిన ఆహారం బరువు తగ్గడానికి అనువైనది మరియు అనివార్యంగా ఈ రెండు ఆహారాల ద్వారా నియంత్రించబడాలి. అందుకని, బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్న వారికి వారి ఆహారంలో ఎంత పదార్థాలు ఉన్నాయో తెలుసుకోవాలి. రొట్టెలోని పోషకాల వివరాలురొట్టెలోని పోషకాల వివరాలురోటీ లేదా చపాతీ వీటిలో ఉన్న కార్బోహైడ్రేట్లు అన్నీ తెలుసుకోవలసిన అవసరం లేదు. వీటిలో కొద్ది మొత్తంలో ప్రోటీన్ మరియు కరగని ఫైబర్ కూడా ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి కూడా చాలా అవసరం. సుమారు ఆరు అంగుళాల వెడల్పు గల చపాతిలో పదిహేను గ్రాముల కార్బోహైడ్రేట్లు, మూడు గ్రాముల ప్రోటీన్, 0.4 గ్రాముల కొవ్వు మరియు డెబ్బై ఒకటి కేలరీలు ఉన్నాయి. అన్నంలో పోషకాల వివరాలుఅన్నంలో పోషకాల వివరాలు 1/3 ప్రమాణం అన్నంలో నభై కేలరీలు, ఒక గ్రాము ప్రోటీన్, ?.1 గ్రాముల కొవ్వు మరియు పద్దెనిమిది గ్రాముల కార్బోహైడ్రేట్లను కలిగి ఉంటుంది. బియ్యం మరియు గోధుమలు, ఏది మంచిది? బియ్యం మరియు గోధుమలు, ఏది మంచిది? ఈ ప్రశ్న ఉత్తర మరియు దక్షిణ భారతీయుల నుండి భిన్న సమాధానం ఉంటుంది. రెండింటిలో నీటిలో కరిగే ఫోలేట్ విటమిన్ బి ఉంటుంది. మన కణాల ఆరోం మరియు కొత్త కణాల పెరుగుదల మరియు అభివృద్ధికి ఈ ఫోలేట్ అత్యవసరం ఉంటుంది. ఈ రెండింటిలో సరిసమాన మోతాదులో ఐరన్ ఉంటుంది. కానీ బియ్యం గోధుమ కన్నా తక్కువ సల్ఫర్ మరియు మెగ్నీషియం కలిగి ఉంటుంది. ఈ సల్ఫర్ మన మూత్రపిండాల పనితీరుకు మరియు కణాల మరమ్మత్తుకు అవసరం. రక్త కణాల పెరుగుదలకు ఇనుము అవసరం మరియు రక్తపోటు మరియు



చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడానికి మెగ్నీషియం అవసరం అవుతుంది. ఆహార నిపుణుల అభిప్రాయం ప్రకారంఆహార నిపుణుల అభిప్రాయం ప్రకారంమీరు రెండింటిలో ఒకదాన్ని మాత్రమే ఎంచుకోవలసి వస్తే, చపాతిని ఎంచుకోండి. "ఒక వేళ నాకు ఈ పరిస్థితి ఎదురైతే, నేను చపాతీనే ఎన్నుకుంటాను. ఇందులో గ్లూటెన్ లేని గోధుమలు లభిస్తుంది. ఈరోజుల్లో ప్రజలు ఎక్కువగా బియ్యం వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే వాస్తవానికి, మనకు లభించే బియ్యం పాలిష్ చేసిన బియ్యం, ఇందులో తక్కువ పోషకాలు మరియు ఎక్కువ పిండి పదార్థాలు ఉన్నాయి, ఇది చక్కెరతో సమానంగా ఉంటుంది. అందుకోసం బియ్యంను ఎంచుకొనే వారు బియ్యం మితంగా ఉండాలని "అని ఆయన వివరించారు. మీరు బరువు తగ్గడానికి రోజుకు ఎన్ని కార్బోహైడ్రేట్లు అవసరం? మీరు బరువు తగ్గడానికి రోజుకు ఎన్ని కార్బోహైడ్రేట్లు అవసరం? ఆహార మార్గదర్శకాల ప్రకారం, ఆరోగ్యకరమైన వ్యక్తులు వినియోగించే కేలరీల మొత్తంలో కార్బోహైడ్రేట్లు 45 నుండి 65 షేడ్స్ మధ్య అందిస్తాయి. మీ ఆహారం సుమారు 2000 కేలరీలను అందిస్తుంటే, 225 నుండి 325 గ్రాముల కార్బోహైడ్రేట్లను పరిగణించండి. మీరు త్వరగా బరువు తగ్గాలంటే, రోజుకు 50 నుండి 150 గ్రాముల కార్బోహైడ్రేట్లను మాత్రమే తినాలని లక్ష్యంగా పెట్టుకోండి. ఈ లెక్క ప్రకారం రోజుకు ఎన్ని చపాతీలు మరియు అన్నం తినాలి? ఈ లెక్క ప్రకారం రోజుకు ఎన్ని చపాతీలు మరియు అన్నం తినాలి? మీరు ఒక ప్లేట్ నిండుగా అన్నం తింటే మీకు 440 కేలరీలు లభిస్తాయి. అంటే దీని అర్థం బరువు తగ్గడానికి అవసరమైన స్థాయి కంటే తక్కువగా ఉంటుంది మరియు బరువు పెరుగుటను నియంత్రించడం సాధించవచ్చు. "మీ మధ్యాహ్న భోజనంలో మీకు రెండు చపాతీ మరియు అర కప్పు అన్నం ఉంటే చాలు, మిగిలిన వాటిని పచ్చి కూరగాయలతో కలిపి తినాలి. రోజు ఈ సమయంలో ఎక్కువగా తినకండి. రాత్రి ఆహారంలో కొద్ది మొత్తంలో నెయ్యి లేదా నూనెలో కాల్చిన పరోటా మరియు కొద్దిగా తాలింపు తినండి చాలు. ప్రత్యావ న్నాయ ఎంపికప్రత్యామ్నాయ ఎంపికమీ భోజనంలో చపాతీ మరియు అన్నం మొత్తాన్ని పరిమితం చేసినప్పటికీ, లభించే ప్రమాణంలో కార్బోహైడ్రేట్లను పూర్తిగా విస్మరించలేరు.

# ప్రతి రోజూ ఉదయం రెండు ఉడికించిన గుడ్లు తింటే బరువు తగ్గొచ్చంట!!



బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్న వారికి ఇక్కడ ఒక శుభవార్త ఉంది. ఇప్పుడు బరువు తగ్గడం అల్పాహారం ఎంపికకు మారినంత సులభం. అల్పాహారంలో గుడ్లు తినే వారు చాలా చురుకుగా ఉంటారని మరియు రోజంతా బరువు తగ్గడానికి సహాయపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి, ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఓబేసిటి ఈ విషయాలను నివేదించింది. ఈ అధ్యయనం ప్రకారం వరుసగా ఐదు రోజులు ఉదయం అల్పాహారంలో రెండు గుడ్లు చొప్పున తిన్న వ్యక్తులు వెన్నరాసిన బన్ తినేవారి కంటే 65% బరువు తగ్గే అవకాశం ఉన్నట్లు కనుగొన్నారు. నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ (ఎన్‌సిబిఐ)అనే సంస్థ నిర్వహించిన మరో అధ్యయనంలో ఇదే ఫలితాలు వచ్చాయని తేలింది. ఈ పరిశోధనలో పాల్గొన్న వారు ఉదయం అల్పాహారంలో గుడ్డు తిన్న వారు , మధ్యాహ్నం మరియు రాత్రి భోజనంలో ఎక్కువ క్యాలరీలున్న ఆహారాన్ని తీసుకోవడం తగ్గించారని గుర్తించబడినది. ఆహారంలో కేలరీలు తక్కువగా ఉండటం వల్ల, బరువు తగ్గే ప్రమాణం సులభంగా పెరుగుతుంది. వాస్తవానికి, గుడ్డును అల్పాహారంగా తిన్న వారు వచ్చే ముప్పై ఆరు గంటలు అధిక కేలరీలున్న ఆహారాన్ని తీసుకోవడం తగ్గించారని గమనించబడింది. ఇంతకూ అల్పాహారంలో గుడ్లు ఎందుకు? దీనికి కొన్ని కారణాలు ఉన్నాయిఇంతకూ అల్పాహారంలో గుడ్లు ఎందుకు? దీనికి కొన్ని







కారణాలు ఉన్నాయిసంతృప్తికరమైన ఆహారాల జాబితాలో గుడ్డు అధిక స్థానంలో ఉంది. ఈ ఆహారాలు తీసుకున్న తర్వాత రోజంతా పొట్ట నిండిన అనుభూతిని మీరు చెందుతారని దీని అర్థం. గుడ్లలో అతి తక్కువ క్యాలరీలు మరియు తక్కువ కొవ్వు మరియు ఎక్కువ శాతంలో ప్రోటీన్ ఉంటుంది. అంటే సుమారు ఆరు గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. జతకు సుమారు తొమ్మిది రకాల ముఖ్యమైన అమైనో ఆమ్లాలు, అలాగే ఇనుము, సల్ఫర్, సెలీనియం, విటమిన్ ఎ, సి మరియు బి 12 వంటి ముఖ్యమైన పోషకాలు ఉత్తమ ప్రమాణంలో ఉన్నాయి.

ఇది చాలా ఆరోగ్యకరమైన ఆహారఇది చాలా ఆరోగ్యకరమైన ఆహారంఇది చాలా ఆరోగ్యకరమైన ఆహారం మరియు ఇది ప్రపంచంలో అత్యంత సమృద్ధిగా, చౌకగా మరియు సులభంగా లభించే ఆహారాలలో ఒకటి.

అల్పాహారం కోసం, గుడ్లను ఆమ్లెట్ రూపంలో తినవచ్చు, కానీ ఇతర రుచికరమైన పద్ధతుల ద్వారా కూడా తినవచ్చు. గుడ్డు తినడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుందనే భ్రమ?ుడ్డు తినడం క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ అందించిన డేటా ప్రకారం క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ అందించిన డేటా ప్రకారం, ఏదైనా ఆహార నియంత్రణ ఆరోగ్యకరమైనది, మితిమీరి తింటే అది విషంగానే






# 2025 లో మిల్కీ బ్యూటీ మెరుపులు కష్టమేనా!



హీరోయిన్ గా అవకాశాలు తగ్గుతున్నాయి అనుకుంటోన్న సమయంలో? మిల్కీబ్యూటీ తమన్నా మరో ఆలోచన లేకుండా తెలివిగా ఐటం గాళ్ గా టర్న్ అయింది. ఏదైనా సినిమాలో హీరోయిన్ ఛాన్స్ వచ్చినా? గెస్ట్ రోల్ ఆఫర్ వచ్చినా చేయడం. వాటితో పాటు ఐటం ఆఫర్ల వచ్చినా కాదనకుండా ఎస్ చెప్పి ముందు కెళ్లడం విషయంలో తమన్నా మంచి సక్సెస్ అయింది. తనకున్న బ్రాండ్ ఇమేజ్ ని తెలివిగా ఎన్ క్యాష్ చేసుకుంది. మూడేళ్లగా తమన్నా ఇదే రూట్ లో సినిమాలు చేసుకుంటూ వెళ్తుంది. దీంతో మినిమం బిజీతోనె కెరీర్ సాగింది. గత రెండేళ్ల కాలంగా ఎనిమిది సినిమాలకు పైగా పనిచేసిందంటే? ఆ రకమైన స్ట్రాటజీ ఉండ టంతో పనైంది అన్నది కాదనలేని వాస్తవం. గత ఏడాదే నాలుగు సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించింది. అయితే ఈ ఏడాది మాత్రం అంతటి జోష్ తో కనిపిస్తుందా? లేదా? అన్నది చెప్పడం కష్టమే. ఎందుకంటే తమన్నా ఖాతాలో సినిమాలేవి కనిపించలేదు. ప్రస్తుతం తెలుగులో తమన్నా ప్రధాన పాత్రలో 'ఓదెల2' లో నటిస్తోంది. చేతిలో ఈ ఒక్క సినిమా మినహా మరో కొత్త ఛాన్స్ లేదు. తెలుగులో గానీ, తమిళ్ లో గానీ కొత్త సినిమాలకు వేటికి సైన్ చేయలేదు. 'డార్లింగ్స్ పార్టనర్స్' వెబ్ సిరీస్ మాత్రం బాలీవుడ్ లో చేస్తోంది. అంతకు మించి మిల్కీ బ్యూటీ కమిట్ మెంట్లు ఏవీ కనిపించలేదు. దీంతో తమన్నా కూడా 'ఓదెల2'పైనే ఎక్కువగా ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇది లేడీ ఓరియేంటెడ్ చిత్రం. సినిమాపై కూడా అంచనాలు బాగానే ఉన్నాయి. హిట్ సినిమాకి సీక్వెల్ కావడంతో? బజ్ బాగానే కనిపిస్తుంది. సక్సెస్ అయితే తెలుగులోనే కొత్త సినిమా ఛాన్సులు అందుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఓదెల 2 ఆన్ సెట్స్ లో ఉన్న సంగతి తెలి సిందే.

# స్వీటీ కోసం రెండు రెడీ అవుతున్నాయా?



స్వీటీ అనుష్క ప్రధాన పాత్రలో క్రిష్ 'ఘాటి' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఆంధ్రా-ఒడిశా బోర్డర్లో జరిగిన ఓ యధార్ధ సంఘ టనాదారంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో అనుష్క బాధితురాలి నుంచి నేరస్తురాలిగా మారిన శక్తివంతమైన పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే సినిమా షూటింగ్ పూర్తయింది. మేజర్ పార్ట్ షూటింగ్ అంతా ఆంధ్రా-ఒడిశా బోర్డర్ అటవీ ప్రాంతంలోనే జరిగింది. సినిమాకు ఆ సన్నివేశాలు హైలైట్ గా నిలుస్తాయని సమాచారం. అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ , ఛేజింగ్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని సమాచారం. ఈ యాక్షన్ సన్నివేశాల విషయంలో స్వీటీ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నటించింది. రియల్ లొకేషన్స్ లో రియల్ స్టంట్స్ తో అదర గొడు తుందని టీమ్ ధీమా వ్యక్తం చేస్తుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అన్ని పనులు పూర్తి చేసి ఏప్రిల్ 18న రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈ సినిమాకి సంబంధించి ఏకంగా రెండు ట్రైలర్లు రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఒక ట్రైలర్ ను ఈ నెలాఖరున రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. ప్రస్తుతం ఆ ట్రైలర్ కట్ కి సంబంధించిన పనుల్లో క్రిష్ బిజీగా ఉన్నట్లు సమాచారం. అనంతరం రెండవ ట్రైలర్ సినిమా రిలీజ్ కు ముందు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారని తెలిసింది. ఈ సినిమాకి సంబంధించి ఇంకా ప్రచారం పనులు మొదలు కాలేదు. సినిమాలో పాటలు రిలీజ్ కాలేదు. ఫిబ్రవరి ముగింపు దూసుస్తుంది. మార్చి ముందుకొస్తుంది. కానీ ప్రచారం మాత్రం లేదు. ఇప్పటికే సినిమాకి ఎలాంటి బజ్ లేదు. దీంతో ఈ సినిమా ప్రచారం విషయంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పూర్తి స్థాయిలో సహకరించాల్సి ఉంటుంది. అనుష్క స్నేహితురాలు కావడంతో యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న చిత్రం కాబట్టి ప్రభాస్ నుంచి ఆరకమైన సహకారం ఎప్పుడూ ఉంటుంది.





# రేపే విడుదల.. 'ఆహా'లో సూపర్ హిట్ మూవీ

2024 డిసెంబర్ 20న క్రిస్టమస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'మార్కో'. మలయాళంలో రూపొందిన మార్కో సినిమాకు హిట్ టాక్ రావడంతో రెండు వారాలు తిరగక ముందే ఇతర భాషల్లోనూ డబ్ చేసి విడుదల చేశారు. తెలుగులో 2025 జనవరి 1న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హనీఫ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు మించి వసూళ్లు నమోదు చేసింది. ఏ సర్టిఫికెట్ వచ్చిన మలయాళ సినిమా వంద కోట్లు, అంతకు మించి వసూళ్లను సొంతం చేసుకోవడం చరిత్రలో ఎప్పుడూ లేదు. మార్కో సినిమాతో ఉన్ని ముకుందన్ ఆ అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకున్నాడు. తెలుగులో ఉన్ని ముకుందన్ నటించిన సినిమాలు మంచి విజయాలను సొంతం చేసుకున్నాయి. ఆయనకు తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు ఉంది. దాంతో మార్కో సినిమా తెలుగులోనూ మంచి వసూళ్లు సొంతం చేసుకుంది. థియేట్రికల్ రిలీజ్ మిస్ అయిన వారు ఓటీటీ ద్వారా మార్కోను చూసేందుకు ఆసక్తిగా ఉన్నారు. తెలుగులో మార్కో సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ కోసం ఎదురు చూస్తున్న ప్రేక్షకులకు ఆహా గుడ్ న్యూస్ చెప్పింది. ఉన్ని ముకుందన్ ముఖ్య పాత్రలో నటించిన మార్కో సినిమాను ఆహా ఓటీటీ ఈనెల 21 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటన చేసింది. మార్కో సినిమా తెలుగు ఓటీటీ ప్రేక్షకులను మెప్పించడం ఖాయం అనే నమ్మకం వ్యక్తం అవుతోంది. సిద్దిక్, జగదీష్, అభిమన్యు, కబీర్ దుహాన్ సింగ్, అన్సల్ పాల్, యుక్తి తారేజా ముఖ్య పాత్రల్లో నటించిన మార్కో సినిమాలో హింస మరీ ఎక్కువ అయిందనే విమర్శలు వచ్చాయి. అవే సన్నివేశాలు యాక్షన్ సన్నివేశాలను ఇష్టపడే ప్రేక్షకులను మళ్లీ మళ్లీ థియేటర్‌కి రప్పించాయని మలయాళ బాక్సాఫీస్ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. రవి బస్రూర్ మరోసారి తన బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో దుమ్ము రేపాడు. యాక్షన్ సన్నివేశాలు సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మలయాళ సినీ చరిత్రలో మార్కో నిలిచి పోయే మూవీ అనడంలో సందేహం లేదు. భారీ యాక్షన్ మూవీని తెలుగులో చూడటం కోసం వెయిట్ చేస్తున్న ఓటీటీ ప్రేక్షకులకు ఆహా గుడ్ న్యూస్ చెప్పింది. ఇప్పటికే సోనీ లివ్ లో సినిమా మలయాళ వర్షన్ స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగు వర్షన్‌ను మాత్రం ఆహా ఓటీటీ స్ట్రీమింగ్ చేయనుంది. నేడు అర్ధ రాత్రి నుంచి మార్కో తెలుగులో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాకి చంద్రు సెల్వరాజ్ అందించిన సినిమాటోగ్రఫీ సైతం ఆకట్టుకుంది.



# తర్వాతి సినిమాకు రెడీ అవుతున్న చైతూ



గత కొన్ని సినిమాలుగా సక్సెస్ లేక ఇబ్బంది పడుతున్న యువ సామ్రాట్ అక్కినేని నాగ చైతన్య తండేల్ సినిమాతో తన సక్సెస్ ఆకలిని తీర్చుకున్నాడు. సాయి పల్లవి హీరోయిన్ గా చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా రూ.110 కోట్ల గ్రాస్ ను దాటేసి, నాగ చైతన్య కెరీర్లోనే బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది. ప్రస్తుతం తండేల్ సక్సెస్ ను ఎంజాయ్ చేస్తున్న నాగ చైతన్య త్వరలోనే తన నెక్స్ట్ సినిమాను మొదలుపెట్టనున్నాడు. చైతన్య తన తర్వాతి సినిమాను విరూపాక్ష ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో చేయనున్న విషయం తెలిసిందే. కార్తీక్ దర్శకత్వంలో నాగ చైతన్య చేయబోతున్న ఈ సినిమా తన కెరీర్లో 24వ మూవీగా తెరకెక్కుతుంది. తాజా సమాచారం ప్రకారం ఔఅ24 ప్రీ ప్రొడక్షన్ చివరి దశకు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరు నుంచి సినిమా పట్టాలెక్కబోతున్నట్టు సమాచారం. తండేల్ సినిమాతో ఇండియా వైడ్ గా గుర్తింపు తెచ్చుకున్న చైతన్యకు ఈ సినిమాతో ఆ క్రేజ్ మరింత పెరగడం ఖాయమనిపిస్తుంది. కాగా ఔఅ24 మిస్టిక్ హార్రర్ థ్రిల్లర్ జానర్ లో రూపొందనుంది. కార్తీక్ దండు ఈ సినిమాలో ఓ కొత్త ప్రపంచాన్ని చూపించనున్నట్టు తెలుస్తోంది. దాని కోసం ఆర్ట్ డైరెక్టర్ నాగేంద్ర ఇప్పటికే స్పెషల్ సెట్స్ ను కూడా నిర్మిస్తున్నాడట. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర మరియు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఈ సినిమాకు అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నాడు. అయితే కార్తీక్ దండు ఈ ప్రాజెక్ట్ కోసం బెస్ట్ టెక్నికల్ టీమ్ ను ఎంపిక చేసుకుని వర్క్ చేయబోతున్నాడు. ఈ సినిమాకు సీజీ వర్క్ భారీ స్థాయిలో ఉండటం వల్ల ఆడియన్స్ కు గొప్ప విజువల్స్ ను అందించి, మెస్మరైజ్ చేయాలని చూస్తున్నాడు.

## విశ్వంభరలో మరో వీణ పాట..?

మెగాస్టార్ చిరంజీవి వశిష్ట కాంబోలో వస్తున్న విశ్వంభర సినిమా ఆడియన్స్ కు విజువల్ ఫీస్ట్ అందించేందుకు వస్తుంది. సినిమా దాదాపు పూర్తి కాగా కొంత వి.ఎఫ్.ఎక్స్ వర్క్ మాత్రమే పెండింగ్ ఉందని తెలుస్తుంది. యువి క్రియేషన్స్ బ్యానర్ లో తెరకెక్కుతున్న విశ్వంభర సినిమా పర్ఫెక్ట్ ప్లానింగ్ తోనే చేస్తున్నారని టాక్. ఈ సినిమాకు ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఎం.ఎం. కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. వశిష్ట తొలి సినిమా బింబిసారకు కీరవాణి మ్యూజిక్ అందించారు. ంశ్రీబనీ ఖీవజీట – 'మజాకా' బ్యూటీ కోరికలు ఇలా ఉన్నాయ్! చిరంజీవి సినిమాకు కీరవాణి మ్యూజిక్ అంటే అది సంథింగ్ స్పెషల్ అని చెప్పాలి. ఐతే ' స్టెప్పులతో కానిచ్చేస్తున్నారు. మరోసారి మెగాస్టార్ కాలు కదిపితే ఎలా ఉంటుందో విశ్వంభరలో చూపించబోతున్నారట. ముఖ్యంగా చిరు ఇంద్ర సినిమాలో వీణ స్టెప్ లాంటిది విశ్వంభర లో ప్లాన్ చేస్తున్నారట. మెగాస్టార్ చిరంజీవి వీణ స్టెప్పు వేస్తే ఎలా ఉంటుందో తెలిసిందే. విశ్వంభర లో మళ్లీ అలాంటి కంపోజింగ్ చేస్తే మాత్రం మెగా ఫ్యాన్స్ కి పండగ అన్నట్టే లెక్క. కొన్నాళ్లుగా చిరంజీవి మార్క్ సినిమా రావట్లేదని ఎదురుచూస్తున్న ఫ్యాన్స్ కి విశ్వంభర కచ్చితంగా మెగా మేనియా చూపిస్తుందని అంటున్నారు. వశిష్ట అటు కథ పరంగా ఎక్కడ అన్నీ పెడుతున్నట్టు తెలుస్తుంది. ం మెగా విశ్వంభర నిజంగానే ఫ్యాన్స్ అంచనాలను మించి ఉంటే మాత్రం బాస్ బాక్సాఫీస్ షేక్ చేయడం గ్యారెంటీ అని చెప్పొచ్చు.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**